'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 63 | శనివారం | 17.10.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 63 | Saturday | 17.10.2026 | Pages: 8 | Rate: 2

కిలో బియ్యం వంద..


సామాన్యుడిపై ధరల దందా..!

ఏం తినేట్టు లేదు.. ఏం కొనేట్టు లేదు..!

- మధ్యతరగతికి మంట.. పేదవాడి తిండి తంటా..!
- పళ్లెంలో అన్నం.. కన్నీళ్ల సుడిగుండం!



సామాన్యుడిని చంపేశారు.. ఇప్పుడు ఆకలిని చంపేస్తున్నారు! కిలో బియ్యం వంద రూపాయలు.. కూరగాయల సంచీకి వందల రూపాయలు.. జీతం అదే.. కూలీ అదే.. కానీ బతుకు ఖర్చు మాత్రం ఆకాశంలో! నెల మొదట్లో తెచ్చిన జీతం నెల మధ్యలోనే ఖాళీ.. మిగిలిన రోజులు ఎలా గడపాలో తెలియక ఇంటి పెద్దల మౌన రోదన.. పిల్లలు అడిగినవి కొనలేక తల్లిదండ్రుల కన్నీళ్లు.. ఇదీ నేటి సామాన్యుడి బతుకు చిత్రం! ఒకప్పుడు పేదరికం మనిషిని చంపేది.. ఇప్పుడు పేదరికంతోపాటు ధరల మంటలు మనిషిలోని ఆశను కూడా చంపేస్తున్నాయి. కడుపు నింపుకోవడానికి సంపాదించాలా? సంపాదించినదంతా కడుపు నింపుకోవడానికే ఖర్చు చేయాలా? ఇదేం బతుకు.. ఇదేం అభివృద్ధి? మన దేశంలోనే పండే బియ్యం పేదవాడికి భారమవుతోంది. పొలంలో పంట పండినా పళ్లెంలో అన్నం పలుచబడుతోంది. అంతర్జాతీయ యుద్ధాల నుంచి చమురు ధరల వరకు.. పన్నుల నుంచి పాలకుల విధానాల వరకు.. మధ్యలో ఎక్కడో ఉన్న లోపాల భారం మాత్రం చివరకు సామాన్యుడి నెత్తినే పడుతోంది. ధరలు తగ్గిస్తామన్న హామీలు ఏమయ్యాయి? అసలు ఈ ధరల దోపిడీకి బాధ్యులెవరు? రైతు పండించిన ధాన్యం నుంచి పేదవాడి పళ్లెం వరకు సాగుతున్న ఈ గొలుసులో ఎక్కడ తెగుతోంది న్యాయం? మనిషి ఆకలిని తీర్చాల్సిన వ్యవస్థే.. ఆ ఆకలితో అతడిని ప్రతిరోజూ ఓడిస్తోందా? ఇది కేవలం ధరల కథ కాదు.. ప్రతి ఇంటి కన్నీటి వ్యథ!



ప్రధాని మోదీ కెనడా టూర్

డిసెంబర్‌లో వరుస విదేశీ పర్యటనలు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ డిసెంబర్ 11, 12 తేదీల్లో కెనడాలో పర్యటించనున్నారు. ఈ విషయాన్ని ఒట్టావాలోని భారత హైకమిషన్ అక్టోబర్ 15న ప్రకటించింది. కెనడా ప్రధాని మార్క్ కార్నీతో ఇటీవల జరిగిన చర్చల్లో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయాలని ఇరువురు నేతలు అంగీకరించారు.



జాతీయ జెండా ఎగరేయడం నేరమా?

- తిరంగా ఉద్యమంపై విపక్షాల గళం
- యువ నేతల అరెస్టుపై ఆగ్రహం
- యాత్రకు ముందే అరెస్టులు



డీలిమిటేషన్‌పై ఏకపక్ష నిర్ణయాలు వద్దు!

- ముందు అఖిలపక్ష భేటీ.. తర్వాతే బిల్లు!
- ప్రధాని మోదీకి ఖర్గే నాలుగోసారి లేఖాస్త్రం
- 64 రోజులైనా ముగియని పార్లమెంట్ సమావేశాలు



బంగ్లాదేశ్ తరహా మార్పునకు కుట్ర? యువతను రెచ్చగొడుతున్న విపక్షం

కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



ప్రజాతీర్పుతోనే పాలకుల మార్పు

రాజ్‌నాథ్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఫైర్



భారత్-అమెరికా కీలక చర్చలు!

జైశంకర్-రూబియో భేటీకి ముహూర్తం ఖరారు

వాణిజ్యం, ఇంధనం, రక్షణ రంగాలపై ఫోకస్

రూబియో భేటీపై రాహుల్ సందేహాలు

ముంబై సమావేశంపై మోదీకి ప్రశ్నలు



హిందూ ఆలయంపై మారణహోమానికి కుట్ర!

- తుపాకీ మొరాయించకపోతే.. రక్తపాతమేనా?
- జాత్యహంకార ద్వేషంపై అమెరికాలో ఆందోళన
- సమాచారం ఇచ్చిన సహోద్యోగి.. తప్పిన పెను ప్రమాదం
- శ్వేతజాతి భావజాలం.. భారతీయులే లక్ష్యంగా దాడి యత్నం

5లో..

దేవుడి సన్నిధిలో భక్తులు ప్రార్థనల్లో నిమగ్నమై ఉన్న వేళ.. బయట మృత్యువు మాటువేసింది! అమెరికాలోని చికాగో సమీప అరోరాలో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంపై భారీ కాల్పులకు 19 ఏళ్ల యువకుడు కుట్ర పన్నినట్లు వెలుగులోకి వచ్చిన సంచలన విషయాలు భారతీయ అమెరికన్లను ఉలిక్కిపడేలా చేశాయి. భారతీయులను చంపాలనే ద్వేషపూరిత వ్యాఖ్యలు.. శ్వేతజాతి ఆధిపత్య భావజాలంతో కూడిన రాతలు.. తుపాకులు, వందలాది తూటాల నిల్వ! ఇదీ పోలీసుల దర్యాప్తులో బయటపడిన భయానక చిత్రం. అక్టోబర్ 11న ఆలయ ప్రాంగణానికి చేరుకున్న నిందితుడి తుపాకీ మొరాయించడంతో పెను ప్రమాదం తప్పిందని అధికారులు వెల్లడించారు. లేకపోతే నవరాత్రి వేడుకల వేళ ఆలయం రక్తసిక్తమయ్యేదా? నిందితుడి సహోద్యోగి అప్రమత్తత, పోలీసుల వేగవంతమైన చర్యలు అనేక ప్రాణాలను కాపాడాయి. ఈ ఘటనపై అమెరికా ప్రజాప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయగా, భారత విదేశాంగ శాఖ అమెరికాలో పెరుగుతున్న జాత్యహంకార విద్వేషంపై ఆందోళన తెలిపింది. అసలు భారతీయులపై ఈ ద్వేషం ఎందుకు? హిందూ ఆలయమే లక్ష్యంగా మారడానికి కారణమేంటి? ఇది ఒంటరి వ్యక్తి ఉన్మాదమా.. లేక విస్తరిస్తున్న విద్వేష భావజాలానికి ప్రమాదకర సంకేతమా? తుపాకీ ఆగింది.. కానీ ద్వేషం ఆగిందా? ఈ సంచలన ఘటన వెనుక ఉన్న అసలు కోణాలేంటి?



పిల్లల సోషల్ మీడియా వాడకం

- సంచలన వ్యాఖ్యలు చేసిన సుప్రీంకోర్టు
- పిల్లల భద్రతకు ప్రత్యేక చట్టమేది?
- కేంద్రం, బాలల హక్కుల కమిషన్‌కు నోటీసులు

సోషల్ మీడియా వల్ల పిల్లలు ఎదుర్కొంటున్న ప్రమాదాలను అరికట్టేందుకు సమగ్ర జాతీయ విధానం రూపొందించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు స్పందించింది. కేంద్ర ప్రభుత్వంతో పాటు జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్)కు నోటీసులు జారీ చేసింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీతో కూడిన ధర్మాసనం ఇండోర్‌లోని ఎమరాల్డ్ హైట్స్ ఇంటర్నేషనల్ స్కూల్, ఆ పాఠశాల విద్యా విభాగం డైరెక్టర్ సిద్ధార్థ్ సింగ్ గిర్వార్ దాఖలు చేసిన పిటిషన్‌ను పరిశీలించింది. మహిళా శిశు అభివృద్ధి శాఖ, న్యాయశాఖలకు కూడా నోటీసులు ఇచ్చింది. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న మరో పిటిషన్‌తో దీనిని జతచేసి డిసెంబర్ 7న తదుపరి విచారణకు జాబితా చేసింది. (వివరాలు 2లో..)

హైదరాబాద్‌లో హ్యుందాయ్ కార్ల ప్లాంట్



- సీఎం రేవంత్ ఆహ్వానం • తెలంగాణకు ఆటోమొబైల్ పరిశ్రమలు

రూ.8,528 కోట్లతో జహీరాబాద్‌లో భారీ ప్రాజెక్టు

తెలంగాణను దేశంలోనే కీలక ఆటోమొబైల్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అడుగులు వేస్తున్నారు. హైదరాబాద్‌లో హ్యుందాయ్ కార్ల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని సంస్థ యాజమాన్యానికి పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. శుక్రవారం బోధి పెవిలియన్‌లో హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ మేనేజింగ్ డైరెక్టర్ చాంగ్యూన్ చో నేతృత్వంలోని ప్రతినిధి బృందం సీఎంతో సమావేశమైంది. ఈ సందర్భంగా పెట్టుబడుల అవకాశాలు, జహీరాబాద్‌లో ప్రతిపాదిత ప్రాజెక్టు పురోగతిపై చర్చించారు. హైదరాబాద్‌లో తయారీ ప్లాంట్ ఏర్పాటు చేస్తే తెలంగాణ పారిశ్రామిక రంగానికి మరింత ఊతం లభిస్తుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. (వివరాలు 2లో..)



తెలంగాణలో కరువు ఆంధ్రాలో జలపండుగా?

- నీళ్లున్నా రైతుకు కన్నీళ్లేనా?
- రేవంత్ సర్కారుపై కేటీఆర్ నిప్పులు

తెలంగాణలో సాగునీటి కొరతకు ప్రకృతి కారణమా? ప్రభుత్వ నిర్లక్ష్యమా? ఇదే ప్రశ్నతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. గోదావరి, కృష్ణా నదుల్లో సుమారు 1,000 టీఎంసీల నీరు వృథాగా దిగువకు వెళ్లిపోయిందని ఆరోపించారు. శ్రీశైలం జలాశయానికి జూలై 29 నుంచే వరద ప్రవాహాలు ప్రారంభమైనా, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులోని నార్లాపూర్ పంప్‌హౌస్ మోటార్లను 76 రోజులపాటు ప్రారంభించలేదని మండిపడ్డారు. 145 మెగావాట్ల సామర్థ్యమున్న భారీ పంపులను సకాలంలో నడిపి ఉంటే సుమారు 40 టీఎంసీల నీటిని ఎత్తిపోసి నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించవచ్చని పేర్కొన్నారు. కేసీఆర్‌కు పేరు వస్తుందనే రాజకీయ కక్షతోనే నీటిని ఎత్తిపోలేదని కేటీఆర్ ఆరోపించారు. ఇవన్నీ ప్రభుత్వంపై ఆయన చేసిన ఆరోపణలే.



ఓట్ల చోరీ కాదు.. ప్రజా తీర్పు

- దొంగలకు ప్రజలు ఓట్లేయడం లేదు!
- మోదీని తప్పించడం ఎవరి తరం కాదు!
- రాహుల్‌పై కిషన్‌రెడ్డి ఘాటు విమర్శలు

ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని కూల్చేందుకు అంతర్జాతీయ డీప్‌స్టేట్, విదేశీ శక్తులు, దేశీయ విద్రోహ శక్తులు కుట్రలు చేస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, శ్రీలంక తరహాలో భారత్‌లోనూ ప్రభుత్వాన్ని కూల్చేస్తామనే రాహుల్‌గాంధీ ఆశలు నెరవేరవని అన్నారు. "ఓట్ల చోరీ జరగలేదు.. దొంగలకు ప్రజలు ఓట్లేయడం లేదు" అంటూ కాంగ్రెస్ ఆరోపణలను తిప్పికొట్టారు. ఎన్నికల్లో గెలిచినప్పుడు ఈవీఎంలు, ఎన్నికల సంఘం మంచివని, ఓడిపోయినప్పుడు అవే తప్పని చెప్పడం కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. (వివరాలు 2లో..)



సొంత జిల్లాలో ప్రాజెక్టులకే దిక్కులేదు!

ముందస్తు చర్యలు లేకే విద్యుత్, నీటి కొరత

యాదాద్రి ప్లాంట్ విభాగాల ప్రైవేటీకరణ వద్దు

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత

అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడిచినా ఒక్క రిజర్వాయర్ కూడా నిర్మించలేదని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత విమర్శించారు. కరువు తీవ్రత గురించి పది నెలల ముందే తెలిసినా ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో రాష్ట్రం విద్యుత్, నీటి కొరతను ఎదుర్కొంటోందని ఆరోపించారు. రైతులకు నవంబర్ చివరి వరకు ఉచిత విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన బొగ్గు కోసం కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను కలిసి విజ్ఞప్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. (వివరాలు 2లో..)



మూడు నెలల్లో రోహిత్ వేముల బిల్లు

విద్యార్థుల హక్కులకు చట్టబద్ధ రక్షణ

వివక్షకు అడ్డుకట్టే లక్ష్యమన్న భట్టి

విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థల్లో కులం, సామాజిక నేపథ్యం ఆధారంగా వివక్షకు తావులేకుండా విద్యార్థుల హక్కులను పరిరక్షించే సమగ్ర చట్టం దిశగా తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. 'రోహిత్ వేముల తెలంగాణ బిల్లు' ప్రాథమిక ముసాయిదాను మూడు నెలల్లో సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సబ్‌కమిటీ రెండో సమావేశంలో బిల్లు రూపకల్పన, న్యాయపరమైన అంశాలు, కార్యాచరణపై చర్చించారు. నిర్దిష్ట గడువులో ముసాయిదాను సీనియర్ సివిల్ సర్వెంట్ల కమిటీకి సమర్పించాలని, ప్రతి దశను వేగంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. (వివరాలు 2లో..)

తెలంగాణలో కరువు ఆంధ్రాలో జలపండుగా?

- **నీళ్లున్నా రైతుకు కన్నీళ్లేనా?**
- **రేవంత్ సర్కారుపై కేటీఆర్ నిప్పులు**

కేసీఆర్‌కు పేరు వస్తుందనే రాజకీయ కక్షతోనే నీటిని ఎత్తిపోలేదని కేటీఆర్ ఆరోపించారు. ఇవన్నీ ప్రభుత్వంపై ఆయన చేసిన ఆరోపణలే.

• ఆంధ్రాలో జలసిరి.. తెలంగాణలో పంట విరామమా?

ఆంధ్రప్రదేశ్‌లో ప్రాజెక్టులు నీటితో కళకళలాడుతుంటే తెలంగాణలో రైతులు సాగునీటికోసం ఎదురుచూడాల్సిరావడం ఏమిటని కేటీఆర్ ప్రశ్నించారు. పట్టిసీమ ద్వారా వందల టీఎంసీల నీటిని ఎత్తిపోస్తున్నారని, కుప్పం వరకు నీటిని తరలిస్తున్నారని పేర్కొన్నారు. మరోవైపు తెలంగాణలో కాళేశ్వరం, కన్నెపల్లి పంప్‌హౌస్‌ల ద్వారా నీటిని సకాలంలో ఎత్తిపోసి ఉంటే పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చేది కాదని వాదించారు. 30 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ అవసరమని, గతంలో 24 గంటల కరెంట్ ఇచ్చామని గుర్తుచేశారు. ప్రస్తుతం విద్యుత్ కోతలు, సాగునీటి కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్‌నినోను సాకుగా చూపి ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పుకోవద్దని సూచించారు. రాజకీయాలు పక్కనపెట్టి రైతులను ఆదుకోవాలని రేవంత్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



• సింగరేణిలో స్కామ్.. బొగ్గులో కమీషన్లా?

వరంగల్ జిల్లా నర్సంపేటలో పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ సింగరేణి బొగ్గు కొనుగోళ్లపైనా ప్రభుత్వాన్ని నిలదీశారు. విదేశీ బొగ్గు కొనుగోళ్ల ప్రతిపాదనల్లో అక్రమాలు ఉన్నాయని ఆరోపిస్తూ, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. సింగరేణి ఉత్పత్తిని తగ్గించి, విద్యుత్ కేంద్రాల్లో బొగ్గు కొరత సృష్టించారని విమర్శించారు. దేశీయ బొగ్గు టన్ను రూ.3,800కు లభిస్తుంటే విదేశీ బొగ్గుకు రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు చెల్లించాల్సి వస్తుందని పేర్కొన్నారు. గతంలో యూనిట్ విద్యుత్‌ను రూ.3.90కు కొనుగోలు చేస్తే కుంభకోణమని విమర్శించిన కాంగ్రెస్, ఇప్పుడు రూ.15 వరకు చెల్లించాల్సిన పరిస్థితి ఎందుకు తెచ్చిందని ప్రశ్నించారు. సింగరేణి బకాయిలు, బొగ్గు సరఫరా, విద్యుత్ కొనుగోళ్లపై పూర్తి విచారణ జరగాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్‌లో హ్యుందాయ్ కార్ల ప్లాంట్

- **సీఎం రేవంత్ ఆహ్వానం**
- **తెలంగాణకు ఆటోమొబైల్ పరిశ్రమలు**
- **రూ.8,528 కోట్లతో జహీరాబాద్‌లో భారీ ప్రాజెక్టు**



హైదరాబాద్‌లో తయారీ ప్లాంట్ ఏర్పాటు చేస్తే తెలంగాణ పారిశ్రామిక రంగానికి మరింత ఊతం లభిస్తుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

రూ.8,528 కోట్ల పెట్టుబడి.. 4,276 మందికి ఉద్యోగాలు

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ జోన్‌లో 678 ఎకరాల విస్తీర్ణంలో హ్యుందాయ్ గ్లోబల్ ఆర్‌అండ్‌డీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. రూ.8,528 కోట్ల పెట్టుబడితో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ద్వారా 4,276 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. వాహనాల రూపకల్పన, పరీక్షలు, పనితీరు పరిశీలన, నాణ్యతా ప్రమాణాల ధ్రువీకరణకు ఈ కేంద్రం ఉపయోగపడనుంది. రాబోయే కొద్ది నెలల్లో భూమిపూజకు సిద్ధమవుతున్నట్లు హ్యుందాయ్ ప్రతినిధులు సీఎంకు తెలిపారు. పెండింగ్ అనుమతులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను రేవంత్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్‌లో రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్న హ్యుందాయ్ ఇంజినీరింగ్ కార్యకలాపాలను జహీరాబాద్ కేంద్రం మరింత విస్తరించనుంది.

మౌలిక సదుపాయాలే తెలంగాణ బలం

దేశంలోని ప్రధాన నగరాలకు అనుసంధానంగా ఉండటం, అంతర్జాతీయ విమానాశ్రయం, రహదారులు, రైల్వే సదుపాయాలు హైదరాబాద్‌కు ప్రత్యేక బలమని సీఎం వివరించారు. ప్రత్యేక మొబిలిటీ క్లస్టర్లు, పెరిఅర్బన్ రీజియన్ (ఫ్యూర్) ప్రణాళికలతో తయారీ రంగాన్ని విస్తరించనున్నట్లు తెలిపారు. 2024 ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాల్లో హ్యుందాయ్‌తో జరిగిన చర్చల అనంతరం, 2025 జూన్‌లో ఆర్‌అండ్‌డీ ప్రాజెక్టుకు రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం తెలిపింది. భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి ప్రణాళికను వివరించిన సీఎం, ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు హాజరుకావాలని సంస్థను ఆహ్వానించారు. తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యాలకు తమ సంస్థ ప్రణాళికలు అనుగుణంగా ఉన్నాయని చాంగ్యూన్‌చో తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామిగా కొనసాగుతామని హామీ ఇచ్చారు.





తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని, బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను సన్ గ్రూప్ చైర్మన్ కళానిధి మారన్ దంపతులు జూబ్లీహిల్స్ నివాసంలో కలిసి తమ కుమార్తె కావ్య మారన్ వివాహ రిసెప్షన్ ఆహ్వానించారు. నవంబర్ 21న చెన్నైలో కావ్య మారన్, అనిరుధ్ రవిచందర్ వివాహ రిసెప్షన్ జరగనుంది.



ఓట్ల చోరీ కాదు..ప్రజా తీర్పు

- **దొంగలకు ప్రజలు ఓట్లేయడం లేదు!**
- **మోదీని తప్పించడం ఎవరి తరం కాదు!**
- **రాహుల్‌పై కిషన్‌రెడ్డి ఘాటు విమర్శలు**

ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని కూల్చేందుకు అంతర్జాతీయ డీప్‌స్టేట్, విదేశీ శక్తులు, దేశీయ విద్రోహ శక్తులు కుట్రలు చేస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, శ్రీలంక తరహాలో భారత్‌లోనూ ప్రభుత్వాన్ని కూల్చేస్తామనే రాహుల్‌గాంధీ ఆశలు నెరవేరవని అన్నారు. "ఓట్ల చోరీ జరగలేదు.. దొంగలకు ప్రజలు ఓట్లేయడం లేదు" అంటూ కాంగ్రెస్ ఆరోపణలను తిప్పికొట్టారు. ఎన్నికల్లో గెలిచినప్పుడు ఈవీఎంలు, ఎన్నికల సంఘం మంచివని, ఓడిపోయినప్పుడు అవే తప్పని చెప్పడం కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, పీవీ నరసింహారావు, వాజ్‌పేయి, మన్మోహన్ సింగ్ ప్రభుత్వాల కాలంలోనూ ఓటర్ల జాబితాల సమగ్ర సవరణ జరిగిందని గుర్తుచేశారు. ఎన్నికల సంఘాన్ని బలహీనపరచడం, న్యాయస్థానాలపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలు చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని హితవు పలికారు.

• తెలంగాణలో అరెస్టులు.. ఢిల్లీలో రాజ్యాంగ పరిరక్షణా?

జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌ను రాజకీయ వివాదాల్లోకి లాగడం దుర్మార్గమని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. దేశ భద్రత కోసం పనిచేసే అధికారులపై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదన్నారు. తెలంగాణలో బీజేపీ నేతలను నిరసనలకు వెళ్లకుండా అడ్డుకుంటూ, అర్ధరాత్రి అరెస్టులు చేయిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఢిల్లీలో రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడటం విడ్డూరమని సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించారు. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి, విదేశీ బొగ్గు కొనుగోళ్లు, విద్యుత్ సరఫరాపై బీఆర్ఎస్, కాంగ్రెస్ పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్న నేపథ్యంలో కిషన్‌రెడ్డి మరో అంశాన్ని స్పృశించారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు బొగ్గు కొరత రాకుండా కోల్ ఇండియా ద్వారా సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. మహానది లేదా వెస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ నుంచి బొగ్గు అందించే ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఎల్‌నినో కారణంగా జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గడం, విద్యుత్ డిమాండ్ పెరగడంతో దేశవ్యాప్తంగా బొగ్గు సరఫరాను కేంద్రం పర్యవేక్షిస్తోందన్నారు.

• సింగరేణి బకాయిలపై రెండు పార్టీలకు చురకలు

సింగరేణిలో 46 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయమైందన్న ప్రచారంపై స్పందిస్తూ, అది దొంగతనం కాదని, అధికారుల లెక్కల సర్దుబాటులో జరిగిన తప్పిదమని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. సంబంధిత అధికారులకు నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. సింగరేణికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.26 వేల కోట్ల నుంచి రూ.29 వేల కోట్ల వరకు బకాయిలు పెట్టగా, కాంగ్రెస్ పాలనలో అవి రూ.59 వేల కోట్ల నుంచి రూ.60 వేల కోట్లకు పెరిగాయని ఆరోపించారు. మరోవైపు, తెలంగాణలో ధాన్యం కొనుగోళ్లకు కేంద్రం రూ.32 వేల కోట్లు కేటాయించిందని, పేదలకు నెలకు ఐదు కిలోల ఉచిత బియ్యం అందిస్తున్నామని చెప్పారు. రాజకీయ ఆరోపణలతో ప్రజా సమస్యలు పరిష్కారం కావని, విద్యుత్, బొగ్గు, సాగునీటి సంక్షోభాలను ఎదుర్కోవడంలో అందరూ బాధ్యతగా వ్యవహరించాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు.

మూడు నెలల్లో రోహిత్ వేముల బిల్లు

- **విద్యార్థుల హక్కులకు చట్టబద్ధ రక్షణ**
- **వివక్షకు అడ్డుకట్టే లక్ష్యమన్న భట్టి**



విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థల్లో కులం, సామాజిక నేపథ్యం ఆధారంగా వివక్షకు తావులేకుండా విద్యార్థుల హక్కులను పరిరక్షించే సమగ్ర చట్టం దిశగా తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. 'రోహిత్ వేముల తెలంగాణ బిల్లు' ప్రాథమిక ముసాయిదాను మూడు నెలల్లో సిద్ధం చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సబ్‌కమిటీ రెండో సమావేశంలో బిల్లు రూపకల్పన, న్యాయపరమైన అంశాలు, కార్యాచరణపై చర్చించారు. నిర్దిష్ట గడువులో ముసాయిదాను సీనియర్ సివిల్ సర్వెంట్ల కమిటీకి సమర్పించాలని, ప్రతి దశను వేగంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

నిపుణులతో సంప్రదింపులు.. సమగ్ర చట్టం

షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసి, న్యాయ, విద్యా, హోంశాఖలతో పాటు యూజీసీ భాగస్వామ్యాన్ని పరిశీలించాలని భట్టి సూచించారు. విద్యార్థులు, అధ్యాపకులు, న్యాయ నిపుణులు, పౌర సమాజ సంస్థల అభిప్రాయాలు సేకరించి ముసాయిదా రూపొందించాలని చెప్పారు. నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం సహకారం తీసుకోవాలని సమావేశం నిర్ణయించింది. బిల్లులో ఉండాలని అభిప్రాయపడింది. పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు ఉన్నతాధికారులు, న్యాయవాది దిశా పడేకర్ పాల్గొన్నారు.

సొంత జిల్లాలో ప్రాజెక్టులకే దిక్కులేదు!

- **ముందస్తు చర్యలు లేకే విద్యుత్, నీటి కొరత**
- **యాదాద్రి ప్లాంట్ విభాగాల ప్రైవేటీకరణ వద్దు**
- **తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత**



అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడిచినా ఒక్క రిజర్వాయర్ కూడా నిర్మించలేదని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత విమర్శించారు. కరువు తీవ్రత గురించి పది నెలల ముందే తెలిసినా ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో రాష్ట్రం విద్యుత్, నీటి కొరతను ఎదుర్కొంటోందని ఆరోపించారు. రైతులకు నవంబర్ చివరి వరకు ఉచిత విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన బొగ్గు కోసం కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను కలిసి విజ్ఞప్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రజా ప్రయోజనాల కంటే వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారంటూ ముఖ్యమంత్రిపై కవిత ఆరోపణలు చేశారు.

ప్రైవేటీకరణ ఆలోచన వద్దు

విద్యుత్ కేంద్రాల ప్రైవేటీకరణపై కవిత ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఒకవైపు విద్యుత్ రంగంపై ప్రభుత్వ నియంత్రణ ఉండాలని ముఖ్యమంత్రి చెబుతూనే, మరోవైపు యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లోని వివిధ విభాగాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం వెనుక ఉద్దేశమేమిటని నిలదీశారు. ఈ నిర్ణయంతో విద్యుత్ యూనిట్ ధరలు పెరిగే ప్రమాదంతో పాటు ఉద్యోగుల భవిష్యత్తు దెబ్బతినే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

పిల్లల సోషల్ మీడియా వాడకం

సంచలన వ్యాఖ్యలు చేసిన సుప్రీంకోర్టు

- **పిల్లల భద్రతకు ప్రత్యేక చట్టమేది?**
- **కేంద్రం, బాలల హక్కుల కమిషన్‌కు నోటీసులు**



సోషల్ మీడియా వల్ల పిల్లలు ఎదుర్కొంటున్న ప్రమాదాలను అరికట్టేందుకు సమగ్ర జాతీయ విధానం రూపొందించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు స్పందించింది. కేంద్ర ప్రభుత్వంతో పాటు జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్)కు నోటీసులు జారీ చేసింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చీతో కూడిన ధర్మాసనం ఇండోర్‌లోని ఎమరాల్డ్ హైట్స్ ఇంటర్నేషనల్ స్కూల్, ఆ పాఠశాల విద్యా విభాగం డైరెక్టర్ సిద్ధార్థ్ సింగ్ గిర్నార్ దాఖలు చేసిన పిటిషన్‌ను పరిశీలించింది. మహిళా శిశు అభివృద్ధి శాఖ, న్యాయశాఖలకు కూడా నోటీసులు ఇచ్చింది. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న మరో పిటిషన్‌తో దీనిని జతచేసి డిసెంబర్ 7న తదుపరి విచారణకు జాబితా చేసింది.

• వయోపరిమితి, తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి

పిల్లల వయస్సును ధ్రువీకరించే విధానం, వయస్సుకు తగిన కంటెంట్ మాత్రమే అందించడం, తల్లిదండ్రుల సమ్మతిని నిర్ధారించడం వంటి నిబంధనలు తప్పనిసరి చేయాలని పిటిషనర్లు కోరారు. నిర్దిష్ట వయస్సులోపు పిల్లలకు సోషల్ మీడియా వినియోగాన్ని నిషేధించాలని, అంతకంటే ఎక్కువ వయస్సున్న పిల్లల ఖాతాలపై తగిన నియంత్రణలు విధించాలని విజ్ఞప్తి చేశారు. సైబర్ వేధింపులు, లైంగిక దోపిడీ, ప్రమాదకర కంటెంట్, వ్యక్తిగత సమాచార దుర్వినియోగం నుంచి పిల్లలను రక్షించేందుకు అమలు చేయగల ప్రత్యేక చట్టపరమైన వ్యవస్థ అవసరమని పేర్కొన్నారు. పిల్లల హక్కులు, జీవన భద్రత, విద్యకు సంబంధించిన రాజ్యాంగ హక్కులకు రక్షణ కల్పించాలని కోరారు.

• చదువుపై ప్రభావం.. మానసిక సమస్యలపై ఆందోళన

మైనర్ పిల్లలు సోషల్ మీడియా ఖాతాలు నిర్వహిస్తూ అపరిచితుల పరిచయాల్లోకి వెళ్తున్నారని, వేధింపులు, బెదిరింపులు ఎదుర్కొంటున్నారని పిటిషన్‌లో వివరించారు. అతిగా మొబైల్ వినియోగించడం వల్ల నిద్ర తగ్గడం, ఏకాగ్రత దెబ్బతినడం, చదువుపై ఆసక్తి తగ్గడం వంటి సమస్యలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఆన్‌లైన్ గుర్తింపు కోసం ఆరాటం, శరీర రూపంపై అసంతృప్తి, ఆందోళన, సామాజికంగా ఒంటరిగా ఉండటం వంటి పరిణామాలపైనా తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. పిల్లల భద్రత బాధ్యతను తల్లిదండ్రులు, పాఠశాలలకే పరిమితం చేయలేమని పిటిషనర్లు స్పష్టం చేశారు. పిల్లలను ఎక్కువసేపు ఆన్‌లైన్‌లో ఉంచేలా రూపొందించిన ప్లాట్‌ఫామ్‌ల విధానాలపైనా నియంత్రణలు అవసరమని కోరారు.



హస్తినలో తెలంగాణ బతుకమ్మ సంబురాలు





న్యూఢిల్లీ, అక్టోబర్ 16: దేశ రాజధాని హస్తినలో తెలంగాణ పూల పండుగ బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం గౌరీపూజతో వేడుకలు ప్రారంభమయ్యాయి. తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్, స్పెషల్ సెక్రటరీ అద్వైత్ కుమార్ సింగ్ ఐఏఎస్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఢిల్లీలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన తెలంగాణవాసులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, మహిళల ఆటపాటలతో ప్రాంగణాన్ని పండుగ శోభతో నింపారు. ఈ సందర్భంగా అద్వైత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ, బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, పల్లె జీవనం, ప్రకృతిపై ప్రేమకు ప్రతీక అని పేర్కొన్నారు. విదేశీ ప్రాంతాల్లోనూ ఇలాంటి వేడుకలు తెలంగాణతో అనుబంధాన్ని బలోపేతం చేస్తాయని తెలిపారు. సంప్రదాయ పాటలు, ఆచారాలను పిల్లలకు పరిచయం చేసి, భావితరాలకు సంస్కృతిని అందించాలని సూచించారు. మహిళలు బతుకమ్మల చుట్టూ చేరి ఉత్సాహంగా పాటలు పాడుతూ ఆడారు. తెలంగాణ భవన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్న ఈ వేడుకలు ప్రసాద వితరణతో ముగిశాయి.



ప్రధాని మోదీ కెనడా టూర్

- డిసెంబర్‌లో వరుస విదేశీ పర్యటనలు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ డిసెంబర్ 11, 12 తేదీల్లో కెనడాలో పర్యటించనున్నారు. ఈ విషయాన్ని ఒట్టావాలోని భారత హైకమిషన్ అక్టోబర్ 15న ప్రకటించింది. కెనడా ప్రధాని మార్క్ కార్నీతో ఇటీవల జరిగిన చర్చల్లో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయాలని ఇరువురు నేతలు అంగీకరించారు. వాణిజ్యం, ఇంధనం, సాంకేతికత, భద్రత, ప్రజల మధ్య సంబంధాల రంగాల్లో స్పష్టమైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని నిర్ణయించారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్న వేళ భారత్-కెనడా సంబంధాలకు ఈ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

టొరంటోలో ప్రవాస భారతీయులతో భేటీ

మోదీ కెనడా పర్యటనలో భాగంగా టొరంటోలో ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించే అవకాశం ఉంది. ఈ పర్యటన ప్రధానంగా టొరంటో కేంద్రంగా సాగుతుందని మార్క్ కార్నీ సంకేతాలిచ్చారు. 2015లో మోదీ కెనడాలో పర్యటించినప్పుడు కూడా ప్రవాస భారతీయులతో సమావేశమయ్యారు. ఈసారి పర్యటనలో ద్వైపాక్షిక సంబంధాలతో పాటు భారత్-కెనడా వాణిజ్య ఒప్పందం కీలక అంశంగా నిలవనుంది. ఈ ఏడాది చివరికల్లా ఒప్పందాన్ని సిద్ధం చేయాలని ఇరు దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు కెనడా హైకమిషనర్ క్రిస్టోఫర్ కూటర్ గతంలో వెల్లడించారు.

జీ20 నుంచి బ్రస్సెల్స్ వరకు కీలక చర్చలు

కెనడా పర్యటన ముగిసిన వెంటనే మోదీ డిసెంబర్ 13 నుంచి 15 వరకు అమెరికాలో జరిగే జీ20 సదస్సుకు హాజరుకానున్నారు. అనంతరం డిసెంబర్ 16, 17 తేదీల్లో బ్రస్సెల్స్‌లో పర్యటించనున్నారు. అక్కడ యూరోపియన్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేయడంతో పాటు ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. ఇదిలా ఉండగా, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం తొలి దశ తుది న్యాయపరమైన ముసాయిదా దశకు చేరువైందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. వాణిజ్య విస్తరణ, అంతర్జాతీయ భాగస్వామ్యాల బలోపేతమే ఈ వరుస విదేశీ పర్యటనల్లో ప్రధాన లక్ష్యాలుగా కనిపిస్తున్నాయి.

జాతీయ జెండా ఎగరేయడం నేరమా?

- తిరంగా ఉద్యమంపై విపక్షాల గళం
- యువ నేతల అరెస్టుపై విపక్షాల ఆగ్రహం
- యాత్రకు ముందే అరెస్టులు

దేశంలో జాతీయ జెండా ఎగరేయడం కూడా నేరమా అంటూ విపక్ష నేతలు కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయంటూ ఢిల్లీలో కొనసాగుతున్న నిరసనల నేపథ్యంలో, కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, ఏఐఎన్ఏ అధ్యక్షురాలు నేహా బోరాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కనాట్ ప్లేస్‌లో నిర్వహించ తలపెట్టిన 'లెహ్రా దో తిరంగా' కార్యక్రమానికి వెళ్లేందుకు సిద్ధమైన దీప్కేను జందేవాలన్‌లోని ఆయన నివాసం వద్ద పోలీసులు అడ్డుకున్నారు. జంతర్ మంతర్‌కు వెళ్తున్న నేహా బోరాను మందీ హౌస్ సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు, వందలాది మంది నిరసనకారులు కనాట్ ప్లేస్, మందీ హౌస్ ప్రాంతాల్లో జాతీయ జెండాలు పట్టుకుని ఆందోళనలు చేపట్టారు. శుక్రవారం సాయంత్రానికి సుమారు 150 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.



ఇది అప్రకటిత ఎమర్జెన్సీ: మమతా బెనర్జీ

యువ నేతల అరెస్టులపై పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. భారత జాతీయ జెండా పట్టుకున్నందుకు అభిజీత్ దీప్కేను అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య హక్కులపై దాడి అని విమర్శించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతులను అణచివేసే ప్రయత్నాలు దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ పరిస్థితులను గుర్తుచేస్తున్నాయని ఆరోపించారు. దీప్కేతో పాటు అశుతోష్ రంకా, సౌరవ్ దాస్‌లకు మద్దతు ప్రకటించారు. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ కూడా స్పందిస్తూ, నేహా బోరా, దీప్కే ఎక్కడ ఉన్నారో వెల్లడించకుండా నిర్బంధించడం చట్టవిరుద్ధమని మండిపడ్డారు. వారిని వెంటనే విడుదల చేయాలని, శాంతియుత నిరసనలను అణచివేయడం ఆపాలని డిమాండ్ చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పదవి నుంచి తప్పుకోవాలని కోరారు.



తిరంగా ఎగరేయడం నేరమా?: కేజ్రీవాల్

ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ కూడా అరెస్టులను తీవ్రంగా ఖండించారు. జాతీయ జెండాను ఎగరేయడం నేరమా అని ప్రశ్నిస్తూ, సొంత దేశంలో తిరంగా ఎగరేయలేకపోతే పాకిస్థాన్‌లో ఎగరేయాలా అంటూ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ చర్యలు నియంతృత్వ ధోరణికి నిదర్శనమని విమర్శించారు. అయితే, నిరసనల వెనుక అరాచకం సృష్టించే ఉద్దేశం ఉందని బీజేపీ ఆరోపించింది. ఎన్నికల్లో ఓటమిని అంగీకరించలేక కాంగ్రెస్ పార్టీ ఎన్నికల అక్రమాల ఆరోపణలు చేస్తోందని బీజేపీ ప్రతినిధి సుధాంశు త్రివేది విమర్శించారు. విదేశీ శక్తుల సూచనలతో దేశంలో అశాంతి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ నిరసనల్లో గత రెండు వారాలుగా పాల్గొంటున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తాజా అరెస్టులపై అప్పటికి స్పందించలేదు.

అనుమతి లేదన్న పోలీసులు.. ప్రశ్నించిన దీప్కే

కనాట్ ప్లేస్ పరిసరాల్లో నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నాయని, తిరంగా యాత్రకు న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ అనుమతి ఇవ్వలేదని పోలీసులు అభిజీత్ దీప్కేకు నోటీసు అందించారు. జాతీయ జెండా ఎగరేయడం తప్పు కాదని, అయితే అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించి జనాన్ని సమీకరించడం నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేశారు. దీనిపై దీప్కే స్పందిస్తూ, న్యూఢిల్లీకి వెళ్లకూడదంటే మరో ప్రాంతానికి వెళ్లవచ్చా, తాను ఏ చట్టాన్ని ఉల్లంఘించానని ప్రశ్నించారు. మరోవైపు, దీప్కేను జాఫర్‌పూర్ కలాన్ పోలీస్ స్టేషన్‌కు, నేహా బోరాను మంగోల్‌పురిలోని యాంటీ నార్కోటిక్స్ టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి తరలించినట్లు సమాచారం. కనాట్ ప్లేస్‌లో భద్రతను కట్టుదిట్టం చేసిన పోలీసులు సెంట్రల్ పార్క్ చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేసి ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌ను మోహరించారు. శాంతియుత నిరసన హక్కు, చట్టవ్యవస్థ పరిరక్షణ మధ్య సాగుతున్న ఈ వివాదం రాజకీయంగా మరింత వేడెక్కింది.

రూబియో భేటీపై
రాహుల్ సందేహాలు

- ముంబై సమావేశంపై మోదీకి ప్రశ్నలు



అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భారత ప్రభుత్వ అధికారులతో ముంబైలో సమావేశం కానున్న నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విదేశాంగ శాఖ అధికారులకే ఈ సమావేశం గురించి స్పష్టత లేనట్లు కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని కోరారు. అక్టోబర్ 16న సామాజిక మాధ్యమం ఎక్స్‌లో స్పందిస్తూ, రూబియో తన ఉద్యోగిని ముంబైకి పిలిపించినట్లుగా వ్యాఖ్యానించారు. అయితే, ఈ వ్యాఖ్యలపై కేంద్ర ప్రభుత్వం, బీజేపీ నుంచి వెంటనే ఎలాంటి స్పందన వెలువడలేదు. భారత విదేశాంగ శాఖ సమావేశ వివరాలను అధికారికంగా ప్రకటించాల్సి ఉండగా, అమెరికా రాయబారి ముందుగానే వెల్లడించడం ఏమిటని కాంగ్రెస్ ప్రశ్నిస్తోంది.

అమెరికా రాయబారి ప్రకటనతో వివాదం

అమెరికా రాయబారి సెర్గియో గోర్ వెల్లడించిన వివరాలే ఈ వివాదానికి కారణమయ్యాయి. రూబియో ముంబైలో భారత ప్రభుత్వ అధికారులతో సమావేశమవుతారని, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. దీనిపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అక్టోబర్ 15న అభ్యంతరం వ్యక్తం చేశారు. భారత విదేశాంగ మంత్రి దేశంలో నిర్వహించే సమావేశాల వివరాలను విదేశీ రాయబారి ప్రకటించడం అసాధారణమని విమర్శించారు. విదేశాంగ శాఖ అధికారిక ప్రతినిధి ప్రకటించాల్సిన విషయాలను ఇతరులు వెల్లడించడం వెనుక కారణమేంటని నిలదీశారు. ఈ వ్యవహారంపై కేంద్రం స్పష్టత ఇవ్వాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది.

జామ్‌నగర్‌లో రిలయన్స్ యూనిట్ సందర్శన

రూబియో పర్యటనలో భాగంగా గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో రిలయన్స్ సంస్థకు చెందిన యూనిట్‌ను సందర్శించే కార్యక్రమం కూడా ఉంది. అనంతరం ముంబైలో భారత విదేశాంగ శాఖ అధికారులతో చర్చలు జరపనున్నారు. ఇంధన రంగానికి సంబంధించిన అంశాలు ఈ పర్యటనలో ప్రాధాన్యం పొందే అవకాశం ఉంది. రూబియో తొలుత ఉజ్బెకిస్థాన్‌లోని సమర్‌కండ్‌కు వెళ్లి, అక్కడి నుంచి అక్టోబర్ 17 నుంచి 22 మధ్య భారత్‌లో పర్యటించనున్నట్లు సమాచారం. ముంబైలో జరగనున్న భేటీపై అధికారిక వివరాలు, చర్చల పూర్తి అజెండా వెల్లడికావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రాహుల్ ప్రశ్నలు, కాంగ్రెస్ విమర్శలతో రూబియో పర్యటన రాజకీయ చర్చకు దారితీసింది.

డీలిమిటేషన్‌పై ఏకపక్ష నిర్ణయాలు వద్దు!

- ముందు అఖిలపక్ష భేటీ.. తర్వాతే బిల్లు!
- ప్రధాని మోదీకి ఖర్గే నాలుగోసారి లేఖాస్త్రం
- 64 రోజులైనా ముగియని పార్లమెంట్ సమావేశాలు

పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రతిపాదనలపై కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా ముందుకు వెళ్లవద్దని కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. కొత్త ప్రతిపాదనలను ఖరారు చేసే ముందు అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని స్పష్టం చేశారు. 2026 అక్టోబర్ 16న మోదీకి రాసిన లేఖలో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిసినప్పటికీ, వాటిని అధికారికంగా ముగిస్తూ ప్రొరోగేషన్ ప్రక్రియ చేపట్టడంలో అసాధారణ జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. ఆగస్టు 13న సమావేశాలు నిరవధికంగా వాయిదా పడినప్పటి నుంచి 64 రోజులు గడిచినా లోక్‌సభ, రాజ్యసభలను అధికారికంగా ప్రొరోగ్ చేయలేదని ఖర్గే గుర్తుచేశారు.

గతంలోనూ పలుమార్లు కోరిన ఖర్గే

డీలిమిటేషన్‌పై రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టే ముందు అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని ఏప్రిల్ 11నే ప్రధానిని కోరినట్లు ఖర్గే వెల్లడించారు. అయితే, ఆ విజ్ఞప్తిని పట్టించుకోకుండా ఏప్రిల్ 14 రాత్రి బిల్లులను బహిరంగపరిచి, ఏప్రిల్ 16న ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహించారని విమర్శించారు. ఏప్రిల్ 17న లోక్‌సభలో ప్రవేశపెట్టిన డీలిమిటేషన్ రాజ్యాంగ సవరణ బిల్లుకు అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ లభించలేదని గుర్తుచేశారు. ఆ తర్వాత జూలై 16, ఆగస్టు 27 తేదీల్లోనూ అఖిలపక్ష భేటీ కోసం లేఖలు రాశానని తెలిపారు. ఇప్పుడు నాలుగోసారి అదే విజ్ఞప్తి చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

కీలక బిల్లుపై తొందరపాటు వద్దు

డీలిమిటేషన్ దేశ రాజకీయ వ్యవస్థపై దీర్ఘకాలిక ప్రభావం చూపే అంశమని ఖర్గే పేర్కొన్నారు. ఇలాంటి కీలక రాజ్యాంగ సవరణపై నిర్ణయం తీసుకునే ముందు అన్ని రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలను చర్చించుకునేందుకు తగిన సమయం ఇవ్వాలని కోరారు. ఇతర రాజకీయ పక్షాలతో పాటు సంబంధిత వర్గాల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. అఖిలపక్ష చర్చలు లేకుండా కీలక బిల్లును పార్లమెంట్‌పై బలవంతంగా రుద్దే ప్రయత్నం చేయవద్దని మోదీని హెచ్చరించారు. గతంలోనూ ఇలాంటి తొందరపాటు ప్రయత్నం విఫలమైందని గుర్తుచేస్తూ, కొత్త ప్రతిపాదనలను పార్లమెంట్ పరిశీలనకు తీసుకురావడానికి ముందే సమగ్ర చర్చ జరగాలని డిమాండ్ చేశారు.

కేంద్రం తదుపరి అడుగులపై కాంగ్రెస్ నజర్

ఖర్గే రాసిన లేఖను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో పంచుకున్నారు. వర్షాకాల సమావేశాల ప్రొరోగేషన్‌లో అసాధారణ జాప్యం, డీలిమిటేషన్‌పై కేంద్ర ప్రభుత్వం తీసుకోబోయే తదుపరి చర్యల గురించి ఖర్గే ప్రధానిని ప్రశ్నించారని ఆయన వెల్లడించారు. నియోజకవర్గాల పునర్విభజన దేశ రాజకీయ ప్రాతినిధ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ఈ అంశంపై విస్తృత చర్చ అవసరమని కాంగ్రెస్ భావిస్తోంది. మరోవైపు, గతంలో బిల్లుకు అవసరమైన మెజారిటీ లభించకపోవడం కేంద్రానికి ఎదురైన రాజకీయ సవాలుగా నిలిచింది.



డీలిమిటేషన్‌పై కేంద్రం ఏ నిర్ణయం తీసుకున్నా, అన్ని పార్టీల భాగస్వామ్యం ఉండాలన్నదే ఖర్గే ప్రధాన డిమాండ్.

ప్రజాతీర్పుతోనే పాలకుల మార్పు

- రాజ్‌నాథ్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఫైర్



భారత్‌లో ప్రభుత్వాలు మారాలంటే ఎన్నికలే మార్గమని, అధికార మార్పు కోరుకోవడంలో తప్పేమీ లేదని కాంగ్రెస్ స్పష్టం చేసింది. దేశంలో అశాంతి సృష్టిస్తూ బంగ్లాదేశ్ తరహాలో ప్రభుత్వాన్ని మార్చేందుకు కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు ప్రయత్నిస్తున్నాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేసిన ఆరోపణలకు పార్టీ ఈ విధంగా స్పందించింది. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం బాధ్యత ప్రభుత్వాన్ని వ్యతిరేకించడం, తప్పులను బయటపెట్టడం, ప్రజాతీర్పుతో అధికారంలోకి రావడం అని కాంగ్రెస్ కమ్యూనికేషన్ల విభాగం అధిపతి జైరాం రమేశ్ పేర్కొన్నారు. మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చెప్పిన మాటలను గుర్తుచేస్తూ, ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రతిపక్షం ప్రజాస్వామ్య బాధ్యత అని వివరించారు.

బంగ్లాదేశ్‌తో పోలిక ఎందుకు?: పవన్ ఖేరా

కాంగ్రెస్ ప్రచార విభాగం అధిపతి పవన్ ఖేరా మాట్లాడుతూ, అధికార మార్పు కోసం బంగ్లాదేశ్, నేపాల్‌ను ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం తమకు లేదన్నారు. 'ఓట్ చోర్, గద్దీ ఛోడ్' నినాదంతో ప్రభుత్వాన్ని ఎన్నికల్లో ఓడించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో అధికార మార్పు ఎన్నికల ద్వారానే జరుగుతుందని పేర్కొంటూ, రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యలపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 2013లో నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ప్రజలు కోరుకుంటున్నారని చేసిన ప్రసంగాన్ని కూడా ఖేరా ప్రస్తావించారు. గతంలో అధికార మార్పును సమర్థించిన బీజేపీ ఇప్పుడు ప్రతిపక్ష నిరసనలను ప్రశ్నించడం ఏమిటని నిలదీశారు.

నిరసనలపై నిషేధం విధిస్తారా?

శాంతియుత ఆందోళనల ద్వారా ప్రభుత్వాలను ప్రశ్నించడం దేశంలో చాలాకాలంగా కొనసాగుతున్న ప్రజాస్వామ్య సంప్రదాయమని కాంగ్రెస్ పేర్కొంది. నిరసనలను రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించాలంటే పార్లమెంట్ ప్రత్యేక సమావేశం నిర్వహించి రాజ్యాంగాన్ని మార్చే ధైర్యం ప్రభుత్వానికి ఉందా అని పవన్ ఖేరా సవాల్ విసిరారు. 2012-13లో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా న్యాయవాది ప్రశాంత్ భూషణ్ చేసిన నిరసనలను అప్పటి బీజేపీ సమర్థించిందని గుర్తుచేశారు. ఇప్పుడు అదే తరహా ఆందోళనలు ఎదురవుతుండటంతో బీజేపీ అసహనానికి గురవుతోందని విమర్శించారు. ఆర్ఎస్ఎస్ ప్రభావం విశ్వవిద్యాలయాలు, ఎన్నికల సంఘం, అధికార యంత్రాంగం వరకు విస్తరించిందని ఆరోపిస్తూ, ఈ వ్యవస్థలో మార్పు తీసుకురావడమే తమ లక్ష్యమని ఖేరా పేర్కొన్నారు.



బంగ్లాదేశ్ తరహా
మార్పునకు కుట్ర?

- యువతను రెచ్చగొడుతున్న విపక్షం
- కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కాంగ్రెస్ పార్టీతో పాటు దాని రాజకీయ మిత్రపక్షాలపై తీవ్ర ఆరోపణలు చేశారు. బంగ్లాదేశ్‌లో జరిగిన పరిణామాల తరహాలో భారత్‌లోనూ ప్రభుత్వ మార్పు తీసుకురావాలని విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని అన్నారు. శుక్రవారం లక్నోలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న పరిణామాలు విపక్షాల ఉద్దేశాలపై అనేక సందేహాలు కలిగిస్తున్నాయని పేర్కొన్నారు.

రాజకీయ ఘర్షణల్లో యువత

దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాల్సిన యువతను కాంగ్రెస్ రాజకీయ ఘర్షణలకు ఉపయోగించుకుంటోందని రాజ్‌నాథ్ సింగ్ ఆరోపించారు. యువతలో ఉన్న శక్తిని సృజనాత్మక కార్యక్రమాల వైపు మళ్లించకుండా, ఆందోళనలు, రాజకీయ గందరగోళం సృష్టించేందుకు వినియోగిస్తున్నారని విమర్శించారు. బంగ్లాదేశ్ పరిణామాల నుంచి స్ఫూర్తి పొందినట్లు కొందరు బహిరంగంగా ప్రకటించారని, మరికొందరు ప్రభుత్వాన్ని కూల్చివేయాలని మాట్లాడుతున్నారని ఆయన అన్నారు. అయితే ఇవి విపక్షాలపై ఆయన చేసిన ఆరోపణలు మాత్రమే.

ఈసీ వివాదంపై రాజకీయ దుమారం

ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్), ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహారంపై విపక్షాలు నిరసనలు చేపడుతున్న నేపథ్యంలో రాజ్‌నాథ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఎన్నికల సంస్కరణల పేరుతో ప్రజల్లో అసంతృప్తిని పెంచి, రాజకీయ అస్థిరతకు దారితీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ఈ నిరసనలు నిజంగా ఎన్నికల సంస్కరణల కోసమేనా, లేక ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడమే లక్ష్యమా అనే ప్రశ్నలను ఆయన లేవనెత్తారు.

రాజ్యాంగ వ్యవస్థలను గౌరవించాలి

రాజ్యాంగ సంస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం బలిపశువులను చేయకూడదని రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ప్రజల తీర్పును గౌరవించాలని, తన రాజకీయ పాత్రపై ఆత్మపరిశీలన చేసుకోవాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి సూచించారు. ప్రజాస్వామ్యం పేరుతో అశాంతిని సృష్టించడానికి, దేశ అభివృద్ధికి ఆటంకం కలిగించడానికి ఎవరికీ హక్కు లేదని అన్నారు. ఎన్నికల సంఘం, ఎన్నికల సంస్కరణలపై కొనసాగుతున్న వివాదం అధికార పక్షం, విపక్షాల మధ్య రాజకీయ పోరును మరింత తీవ్రం చేసింది.

ముంబై వేదికగా భారత్–అమెరికా
కీలక చర్చలు!

- జైశంకర్–రూబియో భేటీకి ముహూర్తం ఖరారు
- వాణిజ్యం, ఇంధనం, రక్షణ రంగాలపై ఫోకస్



భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో అక్టోబర్ 20న ముంబైలో సమావేశం కానున్నారు. ఈ విషయాన్ని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ అక్టోబర్ 16న అధికారికంగా ప్రకటించింది. ఇరు దేశాల మధ్య సమగ్ర ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం ఈ భేటీ ప్రధాన లక్ష్యం. ఇంధనం, వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, కీలక సాంకేతికతలు వంటి అంశాలపై చర్చలు జరగనున్నాయి. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపైనా ఇరువురు నేతలు తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు. ఢిల్లీ వెలుపల ఈ సమావేశం నిర్వహించడంపై కాంగ్రెస్ ప్రశ్నించిన మరుసటి రోజు కేంద్రం అధికారిక ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ముంబైలో యూఏఈ విదేశాంగ మంత్రితోనూ భేటీ

అక్టోబర్ 19, 20 తేదీల్లో ముంబైలో మరో కీలక దౌత్య కార్యక్రమం జరగనుంది. యూఏఈ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి షేక్ అబ్దుల్లా బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో జైశంకర్ సమావేశమవుతారు. భారత్-యూఏఈ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంలో సాధించిన పురోగతిని సమీక్షించనున్నారు. ఇంధనం, వాణిజ్యం, పెట్టుబడులు, ఆర్థిక సాంకేతికత, రక్షణ, రవాణా అనుసంధానం వంటి రంగాల్లో సహకారంపై చర్చిస్తారు. పశ్చిమాసియా పరిస్థితులతో పాటు ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలూ చర్చకు రానున్నాయి. విదేశీ ప్రముఖులతో ఢిల్లీ వెలుపల సమావేశాలు నిర్వహించడం భారత దౌత్య విధానంలో భాగమని విదేశాంగ శాఖ వివరించింది.

కెనడాతో సంబంధాలు.. అమెరికా వ్యాఖ్యలపై అభ్యంతరం

భారత్-కెనడా సంబంధాలపైనా విదేశాంగ శాఖ తాజా సమాచారం వెల్లడించింది. ఇటీవల భారత్‌లో పర్యటించిన కెనడా విదేశాంగ మంత్రి జైశంకర్‌తో ద్వైపాక్షిక సంబంధాల పురోగతిపై చర్చించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కెనడా పర్యటన అంశం కూడా ప్రస్తావనకు వచ్చింది. అయితే, పర్యటన తేదీలు ఇంకా ఖరారు కాలేదని, సరైన సమయంలో ప్రకటిస్తామని అధికారులు తెలిపారు. మరోవైపు, భారత ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై అమెరికా కాంగ్రెస్ సభ్యురాలు ప్రమీలా జయపాల్ చేసిన వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా తప్పుబట్టింది. వాటిని అనవసరమైనవి, సరైన సమాచారం ఆధారంగా లేనివిగా అభివర్ణించింది. మరో ప్రజాస్వామ్య దేశ ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకునేలా ఇలాంటి వ్యాఖ్యలు ఉండటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని కేంద్రం పేర్కొంది.

అమ్మవారి సన్నిధిలో ఆనంద్‌కు సీఎం ఆశీస్సులు



విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాల సందర్భంగా సీనియర్ ఫొటో జర్నలిస్టు వై.డి. ఆనంద్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆత్మీయంగా ఆశీస్సులు అందించారు. అక్టోబర్ 16న మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతీ దేవి అలంకారంలో దర్శనమిచ్చిన కనకదుర్గ మ్మకు ముఖ్యమంత్రి సారె సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతున్న సమయంలో స్టేట్ ఫొటో జర్నలిస్టుల అసోసి యేషన్ కార్యదర్శి ఆనంద్ సీఎంను కలిసి దసరా శుభా కాంక్షలు తెలిపారు. ఆయనను ఆప్యాయంగా పలకరిం చిన చంద్రబాబు భుజంపై చేయి వేసి 'థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీ' అంటూ ఆశీర్వదించారు. అమ్మవారి సన్నిధిలో చోటుచేసుకున్న ఈ ఆత్మీయ పలకరింపు అక్కడున్నవారి దృష్టిని ఆకర్షించింది. మూడు దశాబ్దాలుగా ఫొటో జర్నలి జంలో కొనసాగుతున్న ఆనంద్‌కు ముఖ్యమంత్రి అందించిన ఈ అభినందన ప్రత్యేక సందర్భంగా నిలిచింది. దసరా పర్వదినాన అమ్మవారి సమక్షంలో జరిగిన ఈ సంఘటన జర్నలిస్టు వర్గాల్లో ఆనందాన్ని పంచుకుంది.

పులివెందుల చైర్మన్ బరిలో వైఎస్ ప్రమీల నామినేషన్



పులివెందుల మున్సిపల్ చైర్మన్ పదవికి వైఎస్సా ర్సీపీ అభ్యర్థి వైఎస్ ప్రమీల నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికలకు తమ పార్టీ సిద్ధంగా ఉందని ప్రకటించిన ఆమె, పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఓటర్లు ఎలాంటి ఒత్తిళ్లు, ఇబ్బందులు లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునే వాతావరణం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటేస్తే విజయం తమదేనని ప్రమీల ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు, పలుచోట్ల నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డంకులు సృష్టించడంతో పాటు గొడవ లకు పాల్పడిన ఘటనలు చోటుచేసుకున్నాయని ఆమె ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంఛ నీయ సంఘటనలకు తావులేకుండా అధికారులు నిష్పక్ష పాతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ, ఓటర్లు భయాందోళ నలు లేకుండా తమ అభిప్రాయాన్ని బ్యాలెట్ ద్వారా వ్యక్తం చేసేలా చూడాలని ఆమె పేర్కొన్నారు.

ప్రొద్దుటూరులో ప్రశాంతంగా నామినేషన్ల



ప్రొద్దుటూరు పురపాలక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ తొలి రోజు ప్రశాంతంగా ముగిసింది. శుక్రవారం కౌన్సిలర్ స్థానాలకు మొత్తం 13 నామినేషన్లు దాఖల య్యాయి, అయితే మున్సిపల్ చైర్మన్ పదవికి ఒక్క నామినేషన్ కూడా రాలేదని కమిషనర్, అసిస్టెంట్ ఎన్నికల అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ వెల్లడించారు. ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. స్పెషల్ నోడల్ ఆఫీసర్ వెంకటపతి పర్యవేక్షణలో నామినేషన్ల స్వీకరణ చేపట్టి, వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. అభ్యర్థు లకు ఇబ్బందులు లేకుండా సింగిల్ విండో విధానంలో కుల ధ్రువీకరణ పత్రాలు, నో డ్యూ సర్టిఫికెట్ల జారీకి సదు పాయాలు కల్పించారు. మహిళలు, పురుషులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసి, నామినేషన్ పత్రాలను నిబంధనల ప్రకారం భద్రపరిచారు. పోటీ చేయాలనుకునే అభ్యర్థులు అవసరమైన పత్రాలతో గడువులోగా దరఖాస్తు చేసుకో వాలని అధికారులు సూచించారు. ప్రతి అభ్యర్థికి సమాన అవకాశాలు కల్పిస్తూ ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తామని కమిషనర్ స్పష్టం చేశారు.

ప్రొద్దుటూరు పోరులో వైసీపీ గెలుపు ధీమా!



ప్రొద్దుటూరు మున్సిపల్ ఎన్నికల్లో ప్రజా సమస్యలే తమ ప్రధాన అజెండా అని వైఎస్సార్ సీపీ నేతలు ప్రకటిం చారు. పట్టణంలోని వైఎంఆర్ కాలనీలో శుక్రవారం నిర్వ హించిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, ప్రచారానికి వచ్చే కూటమి నాయకులను గత ఎన్నికల హామీల అమలుపై ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. వైసీపీ హయాంలో అభివృద్ధి పనులు చేపట్టామని, కామనూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించామని పేర్కొన్నారు. గత రెండేళ్లలో పట్టణ అభివృద్ధి మందగించిందని విమర్శించారు. మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి పోరెడ్డి నరసింహారెడ్డి మాట్లాడుతూ, 52 వార్డుల్లోనూ వైసీపీ పోటీ చేస్తుందని, కనీసం 35 స్థానాల్లో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. అభ్యర్థిగా ఎంపిక చేసిన వైఎస్ జగన్, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, రాచమ ల్లుకు కృతజ్ఞతలు తెలిపారు. 2019-2024 మధ్య జరిగిన అభివృద్ధిని ప్రజలు గుర్తించాలని కోరారు. శనివారం చైర్మన్ అభ్యర్థిగా నామినేషన్ వేయనున్నట్లు పోరెడ్డి తెలిపారు.

సీనియర్ జర్నలిస్ట్ అవ్వారి రఘు కన్నుమూత



తెలుగు జర్నలిజం రంగంలో సుదీర్ఘకాలం సేవలందించిన సీనియర్ జర్నలిస్ట్, రీజినల్ న్యూస్ అండ్ ఎనాలిసిస్ చీఫ్ ఎడిటర్ అవ్వారి రఘు కన్నుమూశారు. హైదరా బాద్ ప్రెస్ క్లబ్ సభ్యుడైన ఆయన మరణవార్త మీడియా వర్గాల్లో విషాదాన్ని నింపింది. 1986లో 'ఉదయం' దినపత్రి కలో సబ్ ఎడిటర్ గా తన పాత్రికేయ ప్రస్థానాన్ని ప్రారంభించిన రఘు, అనంతరం పలు పత్రికల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. 'కృష్ణ పత్రిక', 'వర్తమానం', 'నేటినిజం', 'ఏపీ ఎంఎస్' సంస్థల్లో బ్యూరో చీఫ్ గా పనిచేసి తనదైన ముద్ర వేశారు. ఎలక్ట్రానిక్ మీడియా లోనూ సేవలందించిన ఆయన టీవీ5లో చీఫ్ సబ్ ఎడి టర్ గా బాధ్యతలు నిర్వర్తించారు. దశాబ్దాలపాటు వార్తా సేకరణ, సంపాదకత్వ రంగాల్లో పనిచేసిన రఘు మృతి జర్నలిస్టు వర్గాలకు తీరని లోటుగా నిలిచింది. ఆయన అంత్యక్రియలు ఆదివారం హైదరాబాద్ లోని కోకాపేటలో నిర్వహించనున్నారు.

మైదుకూరులో ఎన్నికల వేళ పోలీసుల ఆంక్షలు



మైదుకూరు మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్ష ణకు పోలీసులు అప్రమత్త మయ్యారు. డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ సూచ నల మేరకు అర్బన్ సీఐ హోజీవలి పట్టణంలో 144 సెక్షన్, 30 యాక్ట్ తో పాటు ఇతర నిషేధాజ్ఞలు అమలులో ఉన్నట్లు ప్రకటించారు. నిబంధనల ప్రకారం నలుగురికి మించి గుమికూడరాదని, అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు నిర్వహించకూడదని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారానికి ముందస్తు అనుమతులు తీసుకోవాలని, రాజకీయ నాయకులు, కార్యకర్తలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు, ఘర్షణలకు దూరంగా ఉండాలని సూచించారు. ఓటర్లను బెదిరించడం, ప్రలోభపెట్టడం, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించడం, సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు, రెచ్చగొట్టే పోస్టులు ప్రచారం చేయడం చట్టవిరుద్ధమని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అనుమానాస్పద ఘటనలు, ఘర్షణల సమాచారాన్ని వెంటనే పోలీసులకు అందించాలని కోరారు.



దుర్గమ్మకు బాబు పట్టు వస్త్రాలు!



అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పణ ప్రజల సుఖసంతోషాల కోసం సీఎం ప్రార్థనవిజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మను ముఖ్యమంత్రి చంద్ర బాబు దంపతులు శుక్రవారం దర్శించుకు న్నారు. దసరా నవరాత్రుల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు, సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న సీఎం దంపతులకు అధికారులు, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. పండితుల వేదమంత్రాల నడుమ అమ్మవారి అంతరాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఆశీ ర్వచన మండపంలో అర్చకులు వేదాశీ స్సులు అందజేశారు. ఈవో శీనానాయక్ అమ్మవారి శేషవస్త్రాలను అందించగా, ఆలయ చైర్మన్, ఈవో అమ్మవారి చిత్రప టాన్ని బహూకరించారు. సీఎం దంపతులు పట్టువస్త్రాలు సమర్పించే సమ యంలోనూ సామాన్య భక్తుల దర్శనాలకు అంతరాయం కలగకుండా క్యూ లైన్లను కొనసాగించారు.

ఆరు రోజుల్లో 8 లక్షల దర్శనాలు

దర్శనం అనంతరం చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురవా లని, ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యకరమైన, సంపన్నమైన సమాజంగా ఎదగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు చెప్పారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారని ప్రశంసించారు. ఇంద్రకీలాద్రిపై జరు గుతున్న దసరా ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారని, ఆరు రోజుల్లోనే ఎనిమిది లక్షల మంది అమ్మ వారిని దర్శించుకున్నారని వెల్లడించారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు భక్తిశ్రద్ధ లతో అమ్మవారి ఆశీస్సులు పొందుతున్నా రని పేర్కొన్నారు. విజయవాడ ఉత్సవ్ 2.0, జాతీయ సరస్ మేళా కూడా నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా గుర్తింపు పొందే స్థాయిలో విజయవాడ దసరా ఉత్సవాలు జరగడం సంతోషకరమని, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని ఆకాంక్షించారు.



చీరాల వైసీపీ చైర్మన్ అభ్యర్థిగా
డాక్టర్ షెర్లీ ఖరారు

చీరాల మున్సిపల్ ఎన్నికల బరిలో వైఎస్సార్‌సీపీ కీల నిర్ణయం తీసుకుంది. మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా హైదర బాద్‌లో ఊపిరితిత్తుల వైద్య నిపుణురాలిగా పనిచేస్తున్న డాక్ట ఇస్తర్ల పెర్లీని ఖరారు చేసింది. ఉచిత వైద్య సేవలు, సామాజి కార్యక్రమాలతో పట్టణంలో గుర్తింపు పొందిన డాక్టర్ ఇస్త బాబురావు, సుభాషిణి దంపతుల కుమార్తె కావడం ఆమెక కలిసివచ్చే అంశంగా పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. నియోజ వర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ సిఫార్సుతో అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. గతంలో ఆమె తల్లిద ద్రులు రోటరీ క్లబ్‌తో పాటు పలు సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువయ్యారు. చీరాల పరిధిలోని 44 వార్డుల్లో విస్తృత ప్రచారానికి వైసీపీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. 1 వేలకు పైగా ఉన్న ఎస్సీ ఓటర్లతో పాటు అన్ని వర్గాల ప్రజలన ఆకట్టుకునేలా వ్యూహం రూపొందిస్తోంది. వైద్యురాలైన షె అభ్యర్థిత్వంతో చీరాల మున్సిపల్ ఎన్నికల పోటీ మరింత ఆ క్తికరంగా మారింది.

చైర్మన్ పదవి జనసేనకు.. సాలూరులో మంత్రి కన్నీళ్లు!



టీడీపీలో అసంతృప్తి భగ్గుపార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో మున్సిపల్ చైర్మన్ పదవి కేటాయింపు కూటమిలో అసంతృప్తికి కారణ మైంది. రెండు దశాబ్దాలుగా టీడీపీ కోసం పనిచే సిన నాయకులు, కార్యకర్తలకు అన్యాయం జరి గిందంటూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, సాలూరు ఎమ్మెల్యే గుమ్మిడి సంధ్యారాణి భావో ద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్నట్లు సమాచారం. జనసేనకు చైర్మన్ పదవి కేటా యించడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. స్థానికంగా జనసేనకు బలం తక్కువగా ఉన్నప్పుడు ఆ పార్టీకి పదవి ఎలా కేటాయిస్తారని ఆమె ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఏళ్ల తరబడి పార్టీ జెండా మోసిన కార్యకర్తలకు పదవుల పంపకంలో గుర్తింపు దక్కకపోతే వారికి ఏం సమాధానం చెప్పాలని ఆమె ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం.బు జ్జగింపులు.. అధిష్ఠానానికి కొత్త సవాలుమంత్రి సంధ్యారాణి అసంతృప్తి నేపథ్యంలో జిల్లా ఇన్ ఛార్జి మంత్రి కె. అచ్చెన్నాయుడు రంగంలోకి దిగి ఆమెతో పాటు టీడీపీ శ్రేణులను బుజ్జగించినట్లు తెలుస్తోంది. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, బీజేపీ పెద్దలు చర్చించిన తర్వాతే పదవుల పంపకంపై నిర్ణయాలు తీసుకున్నా రని వివరించినట్లు సమాచారం. ఒకచోట చైర్మన్ పదవి కేటాయిస్తే మరోచోట ఇతర పదవుల ద్వారా సమతుల్యత సాధించాల్సి ఉంటుందని సర్దిచెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. కూటమి ఒప్పందాలు ఒకవైపు, స్థానిక కార్యకర్తల ఆశలు మరోవైపు ఉండటంతో నాయకత్వానికి సవాలు ఎదురవు తోంది. విజయనగరం, విశాఖపట్నం, తిరుపతి వంటి ప్రాంతాల్లోనూ పదవుల పంపకంపై అసంతృప్తి ఉందన్న చర్చ సాగుతోంది.

సాయికృష్ణ కేసు సీబీఐకి.. హైకోర్టు ఆదేశాలు



ఆంధ్రప్రదేశ్ లో గాదె సాయికృష్ణ అనుమానా స్పద కస్టడీ మృతి కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 16న జారీ చేసిన ఆదేశా లతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణకు ముగింపు పలికింది. మార్కాపురంలో నమోదైన కేసుకు సంబంధించి 2026 మేలో సాయికృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విజయ వాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్ లో ఆయనపై చిత్రహింసలు జరిగినట్లు ఆరోప ణలు వచ్చాయి. ఈ ఘటనపై స్వతంత్ర దర్యాప్తు జరగా లన్న డిమాండ్లు పెరిగిన నేపథ్యంలో హైకోర్టు కేసును సీబీఐకి అప్పగించింది. సాయికృష్ణ తల్లి విజయలక్ష్మికి నాలుగు వారాల్లో రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని కూడా ప్రభుత్వాన్ని ఆదేశించినట్లు వైఎస్ జగన్ తన ప్రక టనలో పేర్కొన్నారు.

పోలీసులపై తీవ్రమైన ఆరోపణలు

సాయికృష్ణ మృతిపై ఆయన తల్లి న్యాయస్థానాన్ని ఆశ్ర యించడంతో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. తన కుమారుడి శరీరంపై గాయాల గుర్తులు చూశానని ఆమె ఆరోపించారు. పోలీస్ స్టేషన్ సీసీటీవీ దృశ్యాలు అందు బాటులో లేకపోవడం కూడా అనుమానాలకు తావిచ్చింది. ఈ కేసులో ఇన్ స్పెక్టర్ ఎస్ ఎస్ .వి.వి. నాగరాజును జూన్ 23న అరెస్టు చేశారు. ఐజీ ఎం.రవిప్ర కాశ్ నేతృత్వంలో ఏర్పాటైన సిట్ దర్యాప్తు చేపట్టింది. అయితే, కస్టడీ నుంచి తప్పించుకుని గోవాకు పారిపోయి నట్లు చూపించే ప్రయత్నం జరిగిందని, సీసీటీవీ దృశ్యాలను తారుమారు చేసేందుకు యత్నించారని దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం. పోలీసుల పాత్రతో పాటు ఉన్నతాధికారుల బాధ్యతపైనా విచారణ జరగాలనే డిమాండ్ ఈ కేసులో కీలకంగా మారింది.

జగన్ హర్షం.. ఉన్నతాధికారుల పాత్రపై ప్రశ్నలు

హైకోర్టు నిర్ణయాన్ని వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్వాగతించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యం లోని సిట్ తో కేసును పక్కదారి పట్టించే ప్రయత్నం జరిగిందని ఆయన ఆరోపిం చారు. డీజీపీ, విజయవాడ పోలీస్ కమిష నర్ సహా ఉన్నతాధికారుల పాత్రపైనా సమగ్ర విచారణ జరగాలని తాము మొదటి నుంచీ కోరుతున్నామని తెలిపారు. పదవి, రాజకీయ అండ ఉన్నంత మాత్రాన ఎవరూ చట్టానికి అతీతులు కారని వ్యాఖ్యానించారు. సాయికృష్ణ మృతికి సంబంధించిన పూర్తి నిజాలను సీబీఐ వెలికితీసి, బాధ్యులందరినీ చట్టం ముందు నిలబె ట్టాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని ప్రకటిం చారు.

న్యాయ విచారణపై పెరిగిన ఆశలు

సాయికృష్ణ అదృశ్యంపై ఆయన తల్లి జూన్ 2న హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేయడంతో కేసు వెలుగులోకి వచ్చింది. సెప్టెంబర్ లో సుప్రీంకోర్టు కూడా ఈ వ్యవహారంపై తీవ్రంగా స్పందిం చింది. సాయికృష్ణను మెజిస్ట్రేట్ ఎదుట ఎందుకు హాజరు పరచలేదని, ఫిర్యాదు అందిన వెంటనే ఎఫ్ ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించింది. ఇప్పుడు సీబీఐ దర్యాప్తుతో కస్టడీలో ఏం జరిగిందనే అంశంపై స్పష్టత వస్తుందన్న ఆశలు వ్యక్తమవుతున్నాయి.

విజయవాడలో నామినేషన్ల సందడి.. 19 దాఖలు



విజయవాడలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ఊపందుకుంది. అక్టోబర్ 16న నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలో మొత్తం 19 నామినేషన్లు స్వీకరించారు. వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు వివిధ వార్డుల నుంచి నామినే షన్లు దాఖలు చేశారు. మొదటి సర్కిల్‌లో 32, 46, 54వ వార్డులకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు పోటీకి దిగారు. రెండో సర్కిల్‌లో ఒకటో, 64వ, 71వ వార్డుల నుంచి టీడీపీ అభ్యర్థులు నామినే షన్లు సమర్పించగా, ఇతర వార్డుల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు బరిలో నిలిచారు. మూడో సర్కిల్‌లో 15వ వార్డు నుంచి టీడీపీ, 28వ వార్డు నుంచి జనసేన, 99వ వార్డు నుంచి బీజేపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు వివరాలు వెల్లడించాయి. నాలుగు ప్రధాన పార్టీల అభ్యర్థులు రంగంలోకి దిగడంతో వార్డుల్లో రాజకీయ పోటీకి తెరలేచింది. అయితే నామినేషన్ల పరిశీ లన, ఉపసంహరణ ప్రక్రియ పూర్తయిన తర్వాతే తుది బరిలో నిలిచే అభ్యర్థులపై స్పష్టత రానుంది.

ఓటమి భయంతోనే వైసీపీ ఘర్షణలు: కందుల దుర్గేష్



కాకినాడ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల వేళ వైసీపీ ఉద్దేశపూర్వకంగా ఘర్షణలు సృష్టిస్తోందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆరో పించారు. అక్టోబర్ 16న రాజమండ్రిలో మీడియాతో మాట్లాడుతూ పుంగనూరు, రాయచోటి, ధర్మవరం, తిరుపతిలో నామినే షన్ల తొలిరోజే అల్లర్లు సృష్టించి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి ఎన్నికలను నిలి పివేయాలని కుట్ర పన్నుతోందని విమర్శిం చారు. ఎంపీ మిథున్ రెడ్డి నిబంధనలకు విరుద్ధంగా సుమారు వంద మంది అనుచ రులతో నామినేషన్ కేంద్రంలోకి వచ్చారని, అడ్డుకున్నవారిపైకి వాహనాలు నడిపించా రని ఆరోపించారు. బయటి వ్యక్తులను తీసుకొచ్చి రాయలసీమలో ఫ్యాక్షన్ రాజకీయాలను మళ్లీ రెచ్చగొట్టే ప్రయత్నం జరుగుతోందని మండిపడ్డారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ఎన్నికల సంఘం సుమోటోగా విచారణ చేప ట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మిథున్ రెడ్డిపై చర్యలు తీసుకుని, ఆయనను పదవికి అనర్హుడిగా ప్రకటించాలని కోరారు. ప్రజలను భయపెట్టి ఎన్నికలను అడ్డుకోవాలనే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు.

వైసీపీ దాడులను సహించేది లేదన్న భైరెడ్డి శబరి



తిరుపతి, పుంగనూరు, రాయచోటిలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు దాడులకు పాల్ప డ్డాయంటూ ఎంపీ భైరెడ్డి శబరి తీవ్రంగా ఖండించారు. కర్ణాటక నుంచి రౌడీలను తీసుకొచ్చి ఎంపీ మిథున్‌రెడ్డి దాడులకు పాల్పడ్డారని ఆమె ఆరోపిం చారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరగాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ, హింసతో రాజకీ యాలు చేయడం సరికాదన్నారు. దాడులతో కూటమి కార్యకర్తలను భయ పెట్టలేరని, వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీ యలేరని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కార్యకర్తలకు జెండా పట్టడం నేర్పించారని, అవసరమైతే పోరాటానికీ సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యా నించారు. వైఎస్సార్‌సీపీ అరాచక రాజకీయాలను సహించబోమని హెచ్చరిస్తూ, దాడులకు బాధ్యులైన వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ పోరాటం ప్రజాక్షేత్రంలోనే జరగాలని, దాడులకు తావివ్వరాదని సూచించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్ర తలు కాపాడటం అందరి బాధ్యతని గుర్తుచేస్తూ, స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని పార్టీలు సహకరించాలని భైరెడ్డి శబరి పిలుపునిచ్చారు.

విషాదంగా మారిన విహారయాత్ర
ఐదుగురు మహిళలు మృతి!



దసరా సెలవుల్లో ఆనందంగా గడపాలను కున్న ఓ కుటుంబాన్ని జలాశయం మృత్యుఒ డిలోకి నెట్టింది. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం గొల్లపల్లి రిజర్వాయర్ లో శుక్రవారం ఐదుగురు మహిళలు నీటము నిగి ప్రాణాలు కోల్పోయారు. పెనుకొండలోని దర్గా పేటకు చెందిన కుటుంబ సభ్యులు, స్థానికులు కలిసి సరదాగా గడిపేందుకు జలా శయానికి వెళ్లారు. అందరూ కలిసి భోజనం చేసిన తర్వాత కొందరు మహిళలు నీటిలోకి దిగారు. అయితే లోతు అంచనా వేయలేక జలాశయంలోని లోతైన ప్రాంతానికి వెళ్లడంతో నీటిలో చిక్కుకుని మునిగిపో యారు. ఈ ప్రమాదంలో గాయత్రి (45), పుష్పలత (35), అశ్విని (20), షేక్ హసీనా (48), అత్తర్ మాహి (16) మృతి చెందారు. పండుగ వేళ కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలనుకున్న వారి ఆశలు విషాదంగా ముగిశాయి.ఐదుగురి మృతదేహాల వెలికితీత మహిళలు నీటిలో కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు కేకలు వేస్తూ స్థానికుల సాయం కోరారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. గజ ఈతగాళ్లు, స్థానిక ఈతగాళ్లతో గాలింపు చేపట్టారు. సుదీర్ఘ ప్రయత్నాల అనంతరం ఐదుగురి మృతదేహాలను వెలికితీశారు.మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పెనుకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. డీఎస్పీ శివప్రసాద్ నేతృత్వంలో ఘటనకు సంబంధించిన వివరాలను సేకరిస్తు న్నారు. జలాశయంలో నీటి లోతు, ప్రమాదం జరిగిన పరిస్థితులపై విచారణ కొనసాగు తోంది.సీఎం, జగన్ దిగ్భ్రాంతిఒకే కుటుంబా నికి చెందిన ఐదుగురు మహిళలు మృతి చెందడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్ర బాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల ఆత్మలకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ, బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఐదుగురు మహిళలు మృతి చెందిన ఘటనపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.



హిందూ ఆలయంపై మారణహోమానికి కుట్ర!

- తుపాకీ మొరాయించక పోతే.. రక్తపాతమేనా?
- జాత్యహంకార ద్వేషంపై అమెరికాలో ఆందోళన
- సమాచారం ఇచ్చిన సహోద్యోగి.. తప్పిన పెను ప్రమాదం
- శ్వేతజాతి భావజాలం.. భారతీయులే లక్ష్యంగా దాడి యత్నం

అమెరికాలో హిందూ ఆలయంపై భారీ కాల్పులకు కుట్ర వెలుగులోకి రావడం భారతీయ అమెరికన్లను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. ఇల్లినాయిస్ రాష్ట్రంలోని చికాగో నగరానికి సమీపంలో ఉన్న అరోరా ప్రాంతంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి (బాలాజీ) ఆలయాన్ని లక్ష్యంగా చేసుకుని 19 ఏళ్ల యువకుడు అలెగ్జాండ్రోస్ పపారాకిస్ దాడికి ప్రయత్నించినట్లు పోలీసులు ఆరోపించారు. అక్టోబర్ 11, ఆదివారం ఈ ఘటనకు సంబంధించిన పరిణామాలు చోటుచేసుకున్నాయి. నిందితుడు తన వద్ద ఉన్న తుపాకీతో కాల్పులు జరపాలని భావించినప్పటికీ, ఆయుధం పనిచేయకపోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు దర్యాప్తు అధికారులు తెలిపారు. ఈ కుట్రకు సంబంధించిన సమాచారం ముందుగానే బయటకు రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. నిందితుడితో కలిసి టాకో బెల్‌లో పనిచేసిన సహోద్యోగి అతడి నుంచి వచ్చిన అనుమానాస్పద సందేశాలను గమనించి అధికారులకు సమాచారం అందించారు. దీంతో భారీ ప్రాణనష్టం సంభవించే ప్రమాదం తప్పింది. పోలీసుల కథనం ప్రకారం, నిందితుడు భారతీయులను చంపాలనే ఉద్దేశాన్ని తన సహోద్యోగితో పంచుకున్నాడు. ఆదివారం ప్రత్యేకమైన రోజని, భారతీయులపై దాడి చేయాలనే ఆలోచనతో ఉన్నట్లు తెలిపినట్లు ప్రాసిక్యూటర్లు పేర్కొన్నారు. ఈ సమాచారాన్ని తీవ్రంగా పరిగణించిన పోలీసులు వెంటనే చర్యలు చేపట్టారు. సకాలంలో అందిన ఒక సమాచారం అనేక మంది భక్తుల ప్రాణాలను కాపాడిందనే విషయం ఈ ఘటనలో అత్యంత కీలకంగా నిలిచింది. అయితే, దాడి వెనుక ఉన్న పూర్తి కారణాలు, నిందితుడి ప్రణాళిక ఎంతకాలంగా కొనసాగుతోంది, మరెవరైనా ఇందులో భాగస్వాములుగా ఉన్నారా అనే అంశాలపై దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది.

• తుపాకీ మొరాయించడంతో తప్పిన ముప్పు

పోలీసుల వివరాల ప్రకారం, నిందితుడి పేరుతో నమోదైన ఎరుపు రంగు అక్యూరా ఆర్‌డీఎక్స్ కారు ఆదివారం మధ్యాహ్నం సుమారు 12.25 గంటలకు అరోరాలోని బాలాజీ ఆలయ పార్కింగ్ ప్రదేశంలోకి ప్రవేశించింది. దాదాపు 15 నిమిషాల్లోనే ఆ కారు అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు అధికారులు వెల్లడించారు. కారులో నిందితుడు ఒక్కడే ఉన్నట్లు ప్రాథమిక సమాచారం సూచిస్తోంది. అనంతరం అతడు తన నివాస ప్రాంతానికి తిరిగి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడు సహోద్యోగికి పంపిన సందేశాల్లో తన తుపాకీ పనిచేయలేదని, అక్కడి నుంచి వేగంగా వెళ్లిపోయానని చెప్పినట్లు ప్రాసిక్యూటర్లు కోర్టుకు వివరించారు. ఆ తర్వాత తుపాకీని మళ్లీ ఎలా పనిచేయించాలనే విషయాన్ని ఇంటర్నెట్‌లో వెతికినట్లు దర్యాప్తులో వెల్లడైందని అధికారులు పేర్కొన్నారు. అంతేకాకుండా, తిరిగి దాడి చేయాలనే ఉద్దేశాన్ని కూడా సహోద్యోగికి తెలియజేసినట్లు ఆరోపించారు. నిందితుడు తన వద్ద ఉన్న ఏఆర్ తరహా రైఫిల్ వీడియోను, వ్యూహాత్మక రక్షణ దుస్తులు ధరించిన తన ఫొటోను పంపినట్లు కోర్టు వివరాల్లో పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో అతడు కాల్పులు జరిపి ఉంటే ఎంతమంది ప్రాణాలు కోల్పోయేవారో ఊహించడం కూడా కష్టమే. ఆ సమయంలో ఆలయంలో భక్తులు ప్రార్థనలు చేసుకునే అవకాశం ఉండటంతో ప్రమాద తీవ్రత మరింత ఎక్కువగా ఉండేదని స్థానిక ప్రజాప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇల్లినాయిస్‌కు చెందిన భారతీయ అమెరికన్ కాంగ్రెస్ సభ్యుడు రాజా కృష్ణమూర్తి కూడా తన కుటుంబంతో కలిసి అదే ఆదివారం ఆలయాన్ని సందర్శించినట్లు వెల్లడించారు. దాడి యత్నం జరిగిన సమయంలో తాము అక్కడే ఉన్నామని ఆయన తెలిపారు. తుపాకీ పనిచేయకపోవడం వల్లే ప్రాణనష్టం తప్పిందని ఆయన పేర్కొనడం ఈ ఘటనలో ప్రమాద తీవ్రతను స్పష్టం చేస్తోంది.

• శ్వేతజాతి ఆధిపత్య భావజాలం

పోలీసులు నిందితుడి నివాసంలో తనిఖీలు నిర్వహించినప్పుడు పలు అనుమానాస్పద వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. వాటిలో సీరియల్ నంబర్ లేని ఏఆర్ తరహా రైఫిల్, తూటాలు నింపిన మ్యాగజైన్లు, వందల సంఖ్యలో రైఫిల్ మందుగుండు సామగ్రి, వ్యూహాత్మక రక్షణ దుస్తులు ఉన్నట్లు తెలిపారు. దక్షిణాసియా ప్రజలను అవమానించే పదజాలంతో గుర్తించిన ఒక గ్యాస్ కంటైనర్‌ను, నాజీ చిహ్నాలను సూచించే గుర్తును కూడా స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. నిందితుడు రాసినట్లు భావిస్తున్న ఎనిమిది పేజీల పత్రం దర్యాప్తులో కీలక ఆధారంగా మారింది. అందులో తనను శ్వేతజాతి ఆధిపత్యవాదిగా, నియోనాజీ భావజాలాన్ని అనుసరించే వ్యక్తిగా అభివర్ణించుకున్నట్లు పోలీసులు తెలిపారు. శ్వేతజాతికి చెందని ప్రజలపై ద్వేషాన్ని వ్యక్తం చేయడంతోపాటు, వీలైనంత ఎక్కువ మందిని హతమార్చాలనే ఆలోచనలను ఆ పత్రంలో వివరించినట్లు ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. ఈ వివరాలు బయటకు రావడంతో ఆలయంపై దాడి కేవలం వ్యక్తిగత విభేదాల ఫలితమా, లేక జాత్యహంకార భావజాలంతో ప్రేరేపించబడిన చర్యా అనే ప్రశ్నలు ముందుకొచ్చాయి. అయితే, దర్యాప్తు ప్రారంభ దశలోనే ఆరోపణలను తుది నిర్ధారణలుగా భావించరాదని న్యాయపరమైన ప్రక్రియ సూచిస్తోంది. నిందితుడి తల్లి నుంచి పోలీసులు ప్రశ్నించినప్పటికీ, ఆమె దర్యాప్తుకు సహకరించడం లేదని అధికారులు తెలిపారు. ఈ కేసులో నిందితుడు ఒక్కడే పనిచేసినట్లు ఇప్పటివరకు తమకు లభించిన సమాచారం సూచిస్తోందని పోలీస్ చీఫ్ విలియం నార్డ్ చెప్పారు. అయినప్పటికీ, దాడి తేదీని ఎందుకు ఎంచుకున్నాడు, ఆలయాన్ని లక్ష్యంగా చేసుకోవడానికి అతడిని ప్రేరేపించిన అంశాలేమిటి, మరేదైనా విస్తృత ప్రణాళిక ఉందా అనే ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది. జాతి ఆధారంగా ఇతరులను తక్కువగా చూడటం, వారి ప్రాణాలను హరించాలనే భావన తీవ్రవాదానికి దారితీసే ప్రమాదాన్ని ఈ కేసు మరోసారి బయటపెట్టింది.

• కోర్టులో కేసు, ఆలయ భద్రత కట్టుబిట్టం

సహోద్యోగి నుంచి అందిన సమాచారంతో పోలీసులు అక్టోబర్ 11న పాలటైన్ ప్రాంతంలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. చికాగోకు సమీపంలోని అరోరాలో ఉన్న ఆలయానికి పాలటైన్ ప్రాంతం సుమారు 40 మైళ్ల దూరంలో ఉంది. నిందితుడిపై ఉగ్రవాద బెదిరింపులకు పాల్పడినట్లు ఒక అభియోగం, ఆయుధాన్ని అక్రమంగా కలిగి ఉన్నట్లు మరో అభియోగం నమోదు చేశారు. అక్టోబర్ 14న కోర్టులో హాజరుపరిచిన అనంతరం అతడిని నిర్బంధంలో ఉంచాలని న్యాయమూర్తి ఆదేశించారు. తదుపరి విచారణ అక్టోబర్ 30న జరగనుంది. అయితే, కేసు ప్రస్తుతం ప్రాథమిక దశలోనే ఉందని, దర్యాప్తు కొనసాగుతున్న కొద్దీ మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని నిందితుడి తరఫు న్యాయవాదులు సూచించారు. పోలీసులు, ప్రాసిక్యూటర్లు వెల్లడించిన అంశాలు ఆరోపణలేనని, న్యాయస్థానంలో అన్ని ఆధారాలను పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం వెలువడుతుందని గుర్తుచేశారు. మరోవైపు, శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్వాహకులు భక్తులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సేవకుల భద్రత తమకు అత్యంత ముఖ్యమని ప్రకటించారు. పోలీసులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని తెలిపారు. ఆలయ పరిసరాల్లో అదనపు భద్రతా ఏర్పాట్లు చేపట్టడంతోపాటు, సాయుధ భద్రతా సిబ్బందిని పెంచినట్లు వెల్లడించారు. ఈ ఘటనతో స్థానిక భారతీయ కుటుంబాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. నవ్‌రాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశముండటంతో భద్రతపై మరింత దృష్టి సారించారు. అరోరా మేయర్ జాన్ లాష్ మాట్లాడుతూ, సమీపంలోని ఇతర ఆలయాలకు కూడా సమాచారం అందించి, ఏదైనా అనుమానాస్పద పరిస్థితి ఎదురైతే వెంటనే పోలీసులను సంప్రదించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రార్థనా స్థలాల్లో భద్రత అనేది కేవలం ఒక ఆలయానికి సంబంధించిన అంశం కాదు; ప్రతి మతానికి చెందిన ప్రజలు నిర్భయంగా ఆరాధన చేసుకునే హక్కుకు సంబంధించిన విషయం.

• భారతీయులపై ద్వేషాన్ని అరికట్టాలనే డిమాండ్

ఈ ఘటనపై అమెరికాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భారతీయ అమెరికన్ కాంగ్రెస్ సభ్యుడు రాజా కృష్ణమూర్తి తన కుటుంబం ఆ ఆలయంలోనే ప్రార్థనలు చేసుకుంటుందని, దాడి యత్నం జరిగిన ఆదివారం తాము కూడా అక్కడికి వెళ్లామని తెలిపారు. అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయే వరకు ఇలాంటి బెదిరింపులను నిర్లక్ష్యం చేయకూడదని ఆయన స్పష్టం చేశారు. ఈ ఘటనను జాత్యహంకారంతో ప్రేరేపిత నేరంగా పరిగణించి దర్యాప్తు చేయాలని ఎఫ్‌బీఐని కోరారు. మతపరమైన సంస్థల భద్రతను బలోపేతం చేయడానికి ప్రభుత్వం అందించే సహాయ నిధులను విడుదల చేయాలని కూడా ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సభ్యుడు బ్రాడ్ షెర్మన్ అమెరికాలో పెరుగుతున్న భారతీయ వ్యతిరేకత, హిందూ వ్యతిరేక ధోరణులను అరికట్టాలని పిలుపునిచ్చారు. సెనేట్ డెమొక్రటిక్ నాయకుడు చక్ షుమర్ ఈ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, జాతి, మతం ఆధారంగా ఏ వర్గంపైనా ద్వేషానికి అమెరికాలో చోటు లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ సభ్యులు అమీ బెరా, సుజన్ డెల్‌బేన్, శ్రీ థానేదార్, నిక్ లాలోటా, జోష్ గాట్హైమర్ తదితరులు కూడా ఈ దాడి యత్నాన్ని ఖండించారు. మతం, జాతి, పూర్వీకుల ఆధారంగా ఎవరికీ ప్రాణభయం ఉండకూడదని స్పష్టం చేశారు. సెనేట్ జ్యుడీషియరీ కమిటీలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న డిక్ దర్బిన్ కూడా విపక్షాన్ని ఎదుర్కోవడంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. చికాగోలోని ఇజ్రాయెల్ కాన్సుల్ జనరల్ ఎలాద్ స్ట్రోహ్‌మేయర్ హిందూ సమాజానికి సంఘీభావం ప్రకటించారు. ద్వేషం ఒక సమాజాన్ని లక్ష్యంగా చేసుకున్నా, దాని ప్రభావం మొత్తం సమాజంపై పడుతుందని వ్యాఖ్యానించారు. మత స్వేచ్ఛ, వ్యక్తిగత భద్రత అమెరికా ప్రజాస్వామ్యానికి ప్రాథమిక విలువలు. వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంతోపాటు సమాజంపైనా ఉందని నేతల స్పందనలు స్పష్టం చేస్తున్నాయి.



హిందువులపై దాడుల వెనుక అసలేం జరిగింది?

అమెరికాలో హిందూ ఆలయాలపై దాడుల యత్నాలు, దక్షిణాసియా ప్రజలపై విద్వేష ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. అమెరికాలోని బాలాజీ ఆలయంపై దాడి యత్నంపై భారత విదేశాంగ శాఖ స్పందిస్తూ, పెరుగుతున్న జాత్యహంకార విద్వేషం, భారతీయ వ్యతిరేక ధోరణులపై ఆందోళన వ్యక్తం చేసింది. భారతీయుల భద్రతకు ముప్పు కలిగించే బెదిరింపులను తీవ్రంగా పరిగణించాలని స్పష్టం చేసింది. చికాగో పరిసర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో భారతీయ అమెరికన్లు నివసిస్తున్న నేపథ్యంలో ఈ ఘటన స్థానిక సమాజంలో భద్రతపై ప్రశ్నలు లేవనెత్తింది. ద్వేష ప్రచారమే కారణమా? ఆసియా అమెరికన్లపై విద్వేష ఘటనలను నమోదు చేసే స్టాప్ ఏఏపీఐ హేట్ సంస్థ సహ వ్యవస్థాపకురాలు మంజుషా కులకర్ణి మాట్లాడుతూ, దాడి విఫలమై ఎవరూ గాయపడకపోవడం ఊరటనిచ్చినా, హిందువులు, భారతీయులు, దక్షిణాసియా ప్రజల్లో భయాందోళనలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. వలసదారులు, ఇతర జాతులపై భయాన్ని రెచ్చగొట్టే రాజకీయ వ్యాఖ్యలు ద్వేషానికి ఆజ్యం పోయవచ్చని హెచ్చరించారు. వరుస ఘటనలతో పెరుగుతున్న ఆందోళన అక్టోబర్ ప్రారంభంలో ఒహాయోలోని రిచ్‌మండ్ హైట్స్‌లో శ్రీస్వామినారాయణ వడ్తాల్ ధామ్ ఆలయంపై విధ్వంసక చర్యలు జరిగినట్లు సౌత్ ఏషియన్స్ ఫర్ అమెరికా సంస్థ ప్రస్తావించింది. అయితే, ఈ ఘటనలన్నింటి వెనుక ఒకే కారణం ఉందని నిర్ధారించలేం. బాలాజీ ఆలయ కేసులో నిందితుడి భావజాలం, అతడు రాసిన పత్రం, సహోద్యోగికి పంపిన సందేశాలు దర్యాప్తులో కీలకంగా మారాయి. కారణాలపై సమగ్ర దర్యాప్తు అవసరం మత, జాతి ఆధారిత విద్వేషం ఉందా అనే అంశాన్ని ఆధారాలతో తేల్చాలి. అమెరికా సమాజం మొత్తాన్ని భారతీయ వ్యతిరేకిగా చిత్రీకరించడం సరికాదు. దాడిని అడ్డుకున్న వ్యక్తి, వేగంగా స్పందించిన పోలీసులు బాధ్యతాయుత చర్యలకు ఉదాహరణగా నిలిచారు. ద్వేష నేరాలపై కఠిన చర్యలు, ఆలయాలకు భద్రత, మైనారిటీల రక్షణతోనే ఇలాంటి ఘటనలను అరికట్టగలుగుతారు.



సామాన్యుడిని చంపేశారు.. ఇప్పుడు ఆకలిని చంపేస్తున్నారు! కిలో బియ్యం వంద రూపాయలు.. కూరగాయల సంచీకి వందల రూపాయలు.. జీతం అదే.. కూలీ అదే.. కానీ బతుకు ఖర్చు మాత్రం ఆకాశంలో! నెల మొదట్లో తెచ్చిన జీతం నెల మధ్యలోనే ఖాళీ.. మిగిలిన రోజులు ఎలా గడపాలో తెలియక ఇంటి పెద్దల మౌన రోదన.. పిల్లలు అడిగినవి కొనలేక తల్లిదండ్రుల కన్నీళ్లు.. ఇదీ నేటి సామాన్యుడి బతుకు చిత్రం! ఒకప్పుడు పేదరికం మనిషిని చంపేది.. ఇప్పుడు పేదరికంతోపాటు ధరల మంటలు మనిషిలోని ఆశను కూడా చంపేస్తున్నాయి. కడుపు నింపుకోవడానికి సంపాదించాలా? సంపాదించినదంతా కడుపు నింపుకోవడానికే ఖర్చు చేయాలా? ఇదేం బతుకు.. ఇదేం అభివృద్ధి? మన దేశంలోనే పండే బియ్యం పేదవాడికి భారమవుతోంది. పాలంలో పంట పండినా పళ్లెంలో అన్నం పలుచబడుతోంది. అంతర్జాతీయ యుద్ధాల నుంచి చమురు ధరల వరకు.. పన్నుల నుంచి పాలకుల విధానాల వరకు.. మధ్యలో ఎక్కడో ఉన్న లోపాల భారం మాత్రం చివరకు సామాన్యుడి నెత్తినే పడుతోంది. ధరలు తగ్గిసామన్న హామీలు ఏమయ్యాయి? అసలు ఈ ధరల దోపిడీకి బాధ్యులెవరు? రైతు పండించిన ధాన్యం నుంచి పేదవాడి పళ్లెం వరకు సాగుతున్న ఈ గొలుసులో ఎక్కడ తెగుతోంది న్యాయం? మనిషి ఆకలిని తీర్చాల్సిన వ్యవస్థే.. ఆ ఆకలితో అతడిని ప్రతిరోజూ ఓడిస్తోందా? ఇది కేవలం ధరల కథ కాదు.. ప్రతి ఇంటి కన్నీటి వ్యథ!

కిలో బియ్యం వంద.. సామాన్యుడిపై ధరల దందా..!

ఏం తినేట్టు లేదు.. ఏం కొనేట్టు లేదు..!

- మధ్యతరగతికి మంట.. పేదవాడి తిండి తంటా..!
- పళ్లెంలో అన్నం.. కన్నీళ్ల సుడిగుండం!

ఇంట్లో పొయ్యి వెలిగించాలంటేనే గుండెల్లో గుబులు పుడుతోంది. కూరగాయలు కొనాలంటే జేబు ఖాళీ అవుతోంది. బియ్యం కొనాలంటే నెల బడ్జెట్ తలకిందులవుతోంది. నిన్నటి వరకు కుటుంబానికి సరిపడా సరుకులు కొనుగోలు చేసిన డబ్బుతో నేడు సగం అవసరాలు కూడా తీరడం లేదు. కిలో బియ్యం ధర రూ.100కు చేరిందంటే అది కేవలం ఒక వస్తువు ధర పెరగడం కాదు.. సామాన్యుడి జీవితంలో అన్నం ముద్దకు కూడా లెక్కలు వేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడటమే. కిలో కూరగాయలు రూ.100కి చేరుకోవడం, పప్పులు, నూనెలు, పాలు, గ్యాస్ ధరలు కుటుంబ ఖర్చులను పెంచడం పేద, మధ్యతరగతి ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఒకవైపు పిల్లల చదువులు, మరోవైపు ఇంటి అద్దె, విద్యుత్ బిల్లులు, మందుల ఖర్చులు.. వీటన్నింటి మధ్య కుటుంబానికి రెండు పూటల భోజనం సమకూర్చడమే పెద్ద సవాలుగా మారుతోంది. నెల మొదట్లో చేతికి వచ్చే జీతం, కూలీ డబ్బులు నెల మధ్యలోనే ఆవిరైపోతున్నాయి. మిగిలిన రోజులు ఎలా గడపాలో తెలియక కుటుంబ పెద్దలు లోలోపల కుమిలిపోతున్నారు. పిల్లలు అడిగిన పండు కొనలేక, భార్య కోరిన కూర తీసుకురాలేక, వృద్ధులకు అవసరమైన పౌష్టికాహారం అందించలేక బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ధరల పెరుగుదల అనేది గణాంకాల్లో కనిపించే శాతం మాత్రమే కాదు.. పేదవాడి పళ్లెంలో తగ్గుతున్న అన్నం, తల్లి కళ్లలో కనిపించే ఆందోళన, తండ్రి మనసులో పేరుకుపోతున్న నిస్సహాయత. సంపాదన పెరగకుండానే ఖర్చులు పెరిగితే కుటుంబం ఎలా నిలబడుతుంది? ఆకలి తీర్చుకోవడానికే ఇంత పోరాటం చేయాల్సి వస్తే భవిష్యత్తు కోసం పొదుపు ఎలా సాధ్యం? ఈ ప్రశ్నలు ప్రతి ఇంట్లో వినిపిస్తున్నా పాలకుల నుంచి ప్రజలకు కావాల్సిన భరోసా మాత్రం కనిపించడం లేదనే ఆవేదన వ్యక్తమవుతోంది.

• చమురు సంక్షోభం.. ప్రపంచాన్ని కలిపిన ధరల గొలుసు!

ధరల పెరుగుదలకు దేశీయ కారణాలు మాత్రమే కాకుండా అంతర్జాతీయ పరిణామాలు కూడా ప్రభావం చూపుతున్నాయి. నేటి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఒక దేశంలో జరిగే యుద్ధం మరో దేశంలోని సామాన్యుడి వంటగదిని ప్రభావితం చేయగలదు. కొన్ని దశాబ్దాల క్రితం కంటే ప్రస్తుతం దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు విస్తరించాయి. ఒక వస్తువు తయారీకి అవసరమైన ముడిసరుకు ఒక దేశం నుంచి, ఇంధనం మరో దేశం నుంచి, యంత్ర భాగాలు ఇంకో దేశం నుంచి రావచ్చు. ఈ పరస్పర ఆధారపడే వ్యవస్థనే అంతర్జాతీయ సరఫరా గొలుసు అంటారు. ఉదాహరణకు, కార్ల తయారీలో అనేక దేశాల నుంచి వచ్చే విడిభాగాలు అవసరమవుతాయి. ఇదే విధంగా వ్యవసాయం కూడా ప్రపంచ సరఫరా వ్యవస్థతో అనుసంధానమై ఉంది. భారత్‌లో వరి పండించినప్పటికీ సాగుకు అవసరమైన ఇంధనం, ఎరువుల ముడిసరుకు, యంత్రాల విడిభాగాలు, రవాణా సేవలపై అంతర్జాతీయ పరిణామాల ప్రభావం పడవచ్చు. చమురు ధర పెరిగితే రవాణా ఖర్చు పెరుగుతుంది. నౌకల అద్దెలు పెరిగితే దిగుమతి అయ్యే వస్తువుల ధరలు పెరుగుతాయి. ఎరువుల తయారీ ఖర్చులు పెరిగితే వ్యవసాయ పెట్టుబడులపై ఒత్తిడి



కనిపించాలి.

ప్రభుత్వాల

ఉండే

పెరుగుతుంది. ఈ ప్రభావాలు ఒకదానితో మరొకటి కలిసినప్పుడు ధరల పెరుగుదల వేగంగా ప్రజలకు చేరుతుంది. అంతర్జాతీయంగా ఇంధన సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే అందుబాటులో ఉన్న నిల్వలపై ఒత్తిడి పెరుగుతుంది. సరఫరా తగ్గి, డిమాండ్ కొనసాగితే ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. అయితే ప్రతి వస్తువు ధర పెరుగుదలకు అంతర్జాతీయ సంక్షోభమే కారణమని చెప్పడం కూడా సరైంది కాదు. దేశీయ పన్నులు, మార్కెట్ నియంత్రణ, నిల్వల నిర్వహణ, దిగుమతి విధానాలు, పంపిణీ వ్యవస్థ కూడా కీలక పాత్ర పోషిస్తాయి. ప్రపంచంలో ఎక్కడో చమురు సరఫరా ఆగితే, దాని భారం చివరకు మన ఇంటి బియ్యం సంచిపై పడే పరిస్థితి ఏర్పడింది. అందుకే ధరల సమస్యను ఒక్క బియ్యం మార్కెట్‌కు పరిమితం చేయకుండా ఇంధనం నుంచి వ్యవసాయం వరకు ఉన్న మొత్తం సరఫరా గొలుసును పరిశీలించాలి.

• మూడు యుద్ధాల ప్రభావం.. ఇంధనం నుంచి ఇంటి ఖర్చుల వరకు!

ప్రపంచంలో కొనసాగుతున్న యుద్ధాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఇంధన మార్కెట్లను అస్థిరం చేస్తున్నాయి. ఇరాన్-అమెరికా మధ్య ఘర్షణలు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఎర్ర సముద్ర ప్రాంతంలో హూతీ దాడుల వల్ల ఏర్పడిన ఉద్రిక్తతలు అంతర్జాతీయ చమురు రవాణా, సరఫరాపై ప్రభావం చూపగలవు. ముఖ్యంగా గల్ఫ్ ప్రాంతం ప్రపంచ ఇంధన సరఫరాలో కీలకమైనది. అక్కడ నౌకల రాకపోకలకు అంతరాయం కలిగినా, కీలక సముద్ర మార్గాల్లో భద్రతా ముప్పులు పెరిగినా చమురు ధరలు, బీమా ఖర్చులు, నౌకల అద్దెలు పెరిగే అవకాశం ఉంటుంది. ప్రపంచానికి రోజుకు సుమారు పది కోట్ల బ్యారెళ్ల స్థాయిలో చమురు అవసరం

పరిస్థితుల్లో సరఫరాలో పెద్ద అంతరాయం ఏర్పడితే దాని ప్రభావం విస్తృతంగా కనిపిస్తుంది. చమురు రవాణా చేసే భారీ నౌకల నిర్వహణ, ఇంధనం, బీమా, భద్రతా ఖర్చులు పెరిగితే దిగుమతిదారులపై అదనపు భారం పడుతుంది. ఆ భారం ఇంధన ధరలు, రవాణా చార్జీలు, పరిశ్రమల ఉత్పత్తి వ్యయాల ద్వారా ఇతర వస్తువులకు చేరుతుంది. భారత్ వంటి చమురు దిగుమతులపై అధికంగా ఆధారపడే దేశాలకు ఈ పరిణామాలు ప్రత్యేక సవాలుగా మారుతాయి. దేశీయంగా వినియోగించే పెట్రోల్, డీజిల్ ధరల్లో మార్పులు ఆలస్యంగా కనిపించినా, దిగుమతి వ్యయం పెరుగుదల ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడిని సృష్టించవచ్చు. ఎరువుల సరఫరా, వ్యవసాయ యంత్రాల నిర్వహణ, ట్రక్కుల రవాణా, మార్కెట్లకు కూరగాయలు తరలించడం వంటి అనేక రంగాల్లో ఖర్చులు పెరిగే అవకాశం ఉంది. ఒకప్పుడు రైతు పొలం నుంచి మార్కెట్‌కు కూరగాయలు తీసుకురావడానికి అయిన ఖర్చుతో పోలిస్తే ప్రస్తుతం ఇంధనం, కూలీ, వాహన నిర్వహణ ఖర్చులు పెరిగితే కిలో ధర కూడా పెరగవచ్చు. అయినప్పటికీ యుద్ధాల ప్రభావం ఎంత? దేశీయ పన్నుల ప్రభావం ఎంత? మధ్యవర్తుల లాభాలు ఎంత? అనే అంశాలను విడిగా విశ్లేషించాలి. అంతేకాదు, యుద్ధం ముగిసిన వెంటనే ధరలు పాత స్థాయికి వస్తాయని ఆశించడం వాస్తవికం కాదు. సరఫరా వ్యవస్థలు పునరుద్ధరించడానికి, రవాణా సాధారణ స్థితికి చేరడానికి, నిల్వలు భర్తీ కావడానికి సమయం పట్టవచ్చు. యుద్ధం సరిహద్దుల్లో జరుగుతున్నా, దాని ఆర్థిక దెబ్బ సామాన్యుడి ఇంటి బడ్జెట్‌పై పడుతోంది. ప్రపంచ పరిణామాలను సాకుగా చూపి దేశీయ సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, వాటి ప్రభావాన్ని తగ్గించే చర్యలు చేపట్టడం ప్రభుత్వ బాధ్యత.

• పాలకుల హామీలు ఎక్కడ? పన్నులు, విధానాల్లో లోపాలేమిటి?

ధరలు పెరిగినప్పుడు ప్రభుత్వాలు పరిస్థితిని సమీక్షిస్తున్నామని, అవసరమైన చర్యలు తీసుకుంటామని చెబుతాయి. కానీ మార్కెట్‌లో సరుకులు కొనుగోలు చేసే సామాన్యుడికి ఆ ప్రకటనల వల్ల తక్షణ ఉపశమనం లభించకపోతే వాటిపై నమ్మకం తగ్గుతుంది. కేంద్ర, రాష్ట్ర

పన్నుల విధానం ధరలపై ప్రభావం చూపగలదు. పెట్రోల్, డీజిల్‌పై పన్నులు, రవాణా సంబంధిత ఖర్చులు, మార్కెట్ ఫీజులు, ఇతర పరోక్ష పన్నులు ఉత్పత్తి నుంచి వినియోగం వరకు ఖర్చులను ప్రభావితం చేయవచ్చు. కొన్ని వస్తువులపై పన్నులు తగ్గించడం, దిగుమతి సుంకాలను అవసరానికి అనుగుణంగా సవరించడం, నిల్వలపై నిఘా పెట్టడం వంటి చర్యలు ధరల ఒత్తిడిని తగ్గించడానికి ఉపయోగపడవచ్చు. అయితే పన్నుల తగ్గింపు ఒక్కటే అన్ని ధరలను వెంటనే తగ్గించలేదనే వాస్తవాన్ని కూడా గుర్తించాలి. అంతర్జాతీయంగా ముడిసరుకు ధరలు పెరిగితే, సరఫరా తగ్గితే, మార్కెట్‌లో పోటీ లేకపోతే ఇతర సమస్యలు కొనసాగుతాయి. మరోవైపు ప్రభుత్వ ఖర్చుల నిర్వహణ కూడా ముఖ్యమే. అనవసరమైన వ్యయాలను తగ్గించడం, అత్యవసరంకాని ప్రాజెక్టులపై ఖర్చులను కొంతకాలం పునఃపరిశీలించడం, ప్రజలకు నేరుగా ఉపయోగపడే పథకాలకు ప్రాధాన్యం ఇవ్వడం వంటి నిర్ణయాలను పరిస్థితులకు అనుగుణంగా తీసుకోవాలి. అయితే మౌలిక సదుపాయాలపై పెట్టుబడులన్నీ వృథా ఖర్చులని భావించడం సరికాదు. రహదారులు, రవాణా, సాగునీరు, విద్యుత్ వంటి రంగాల్లో పెట్టుబడులు దీర్ఘకాలంలో ఖర్చులను తగ్గించడానికి, ఉత్పత్తిని పెంచడానికి సహాయపడతాయి. అందువల్ల తక్షణ ఉపశమనం అవసరమైన సమయంలో ఖర్చుల ప్రాధాన్యతలను సమీక్షించడం, భవిష్యత్తు అభివృద్ధిని దెబ్బతీయకుండా నిర్ణయాలు తీసుకోవడం అవసరం. ధరల పెరుగుదలపై కేంద్రం రాష్ట్రాలపై, రాష్ట్రాలు కేంద్రంపై నిందలు వేసుకోవడం వల్ల ప్రజలకు ఉపయోగం ఉండదు. ప్రభుత్వం విజయాన్ని ప్రకటించుకోవడం కంటే ప్రజల వంటగదిలో ఖర్చు తగ్గిందా లేదా అనేదే అసలైన కొలమానం. మార్కెట్ ధరలను క్రమం తప్పకుండా ప్రకటించడం, అక్రమ నిల్వలు, కృత్రిమ కొరతపై చర్యలు తీసుకోవడం, అవసరమైన చోట సబ్సిడీలు అందించడం, రేషన్ వ్యవస్థను బలోపేతం చేయడం తక్షణ ప్రాధాన్యాలు కావాలి. బియ్యం, పప్పులు, నూనెలు, కూరగాయలు వంటి నిత్యావసరాల ధరలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాలి. ప్రజలకు సహాయం అందించే చర్యలు ప్రకటనలకే పరిమితం కాకుండా మార్కెట్‌లో

• పరిష్కారం ఏది? పేదవాడి పళ్లెం నిండేదెలా?

ఒక తల్లి తన బిడ్డ ఆకలి తీర్చేందుకు కడుపు మాడ్చుకుంటే.. రోజంతా కష్టపడిన కూలీ రాత్రి భోజనం కోసం అప్పు చేస్తే.. వృద్ధుడు మందులు కొనాలా, కూరగాయలు కొనాలా అని కన్నీళ్లతో లెక్కలేసుకుంటే.. ఆ కుటుంబాల బతుకుల్లో అభివృద్ధి ఎక్కడుంది? ధరల పెరుగుదల కేవలం మార్కెట్ సమస్య కాదు.. పేదవాడి గౌరవంగా బతికే హక్కుపై పడుతున్న దెబ్బ! ఈ భారాన్ని తగ్గించాల్సిన బాధ్యత పాలకులదే. బియ్యం, పప్పులు, నూనెల నిల్వలపై నిరంతర నిఘా పెట్టాలి. కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. అవసరమైన చోట ప్రభుత్వ నిల్వల నుంచి సరుకులు విడుదల చేసి, రేషన్ వ్యవస్థను బలోపేతం చేయాలి. పన్నుల భారం, ప్రభుత్వ అనవసర వ్యయాలను సమీక్షించి, ప్రజలకు తక్షణ ఉపశమనం కల్పించాలి. రైతుకు గిట్టుబాటు ధర దక్కాలి.. వినియోగదారుడికి అందుబాటు ధరకు ఆహారం లభించాలి. ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించే విధానాలే నిజమైన ప్రజాపాలనకు పునాది. చమురు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గిస్తూ ప్రత్యామ్నాయ ఇంధనాలను ప్రోత్సహించాలి. ఎందుకంటే ఆకలి తీర్చలేని పాలనకు అభివృద్ధి గణాంకాలు అలంకారాలే! ఒక కుటుంబం కడుపునిండా తినడానికి అప్పులపాలవ్వాల్సిన పరిస్థితి మారాలి. పేదవాడి పళ్లెంలో అన్నం నిండినప్పుడే ప్రభుత్వ పథకాలకు అర్థం.. ప్రజాస్వామ్యానికి పరమార్థం. లేకపోతే ధరల మంటల్లో కరిగిపోయేది డబ్బు మాత్రమే కాదు.. పేదవాడి ఆశ, ఆత్మగౌరవం, రేపటి మీద నమ్మకం కూడా!




- డాక్టర్ పెంటపాటి పుల్లారావు,
రాజకీయ, ఆర్థిక విశ్లేషకులు

మన దేశంలో పండే బియ్యానికీ ఇంత ధరా?



భారతదేశం వ్యవసాయ ప్రధాన దేశం. లక్షలాది మంది రైతులు కష్టపడి వరి పండిస్తున్నారు. గోదావరి, కృష్ణా వంటి నదుల పరివాహక ప్రాంతాలతో పాటు దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో వరి సాగు జరుగుతోంది. పంట చేతికి వస్తోంది. గోదాముల్లో ధాన్యం నిల్వలు ఉంటున్నాయి. అయినా సామాన్యుడి కొనుగోలు శక్తికి అందని స్థాయిలో బియ్యం ధరలు పెరిగితే సహజంగానే ఒక ప్రశ్న తలెత్తుతుంది.. మన దేశంలోనే పండించే బియ్యానికి మన దేశ ప్రజలే ఇంత ధర ఎందుకు చెల్లించాలి? అయితే వరి పండించడం నుంచి బియ్యం వినియోగదారుడి ఇంటికి చేరే వరకు అనేక దశలు ఉంటాయి. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, సాగునీరు, విద్యుత్, డీజిల్, కోత యంత్రాలు, రవాణా, మిల్లింగ్, గోదాముల నిర్వహణ, ప్యాకింగ్, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారం.. ప్రతి దశలో ఒక ఖర్చు ఉంటుంది. ఈ ఖర్చుల్లో ఏ ఒక్కటి పెరిగినా దాని ప్రభావం చివరకు వినియోగదారుడిపై పడే అవకాశం ఉంది. అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగితే ట్రాక్టర్ల నిర్వహణ నుంచి ధాన్యం రవాణా వరకు ఖర్చులు పెరుగుతాయి. ఎరువుల తయారీ, సరఫరాపైనా ప్రభావం పడుతుంది. రైతుకు పెట్టుబడి ఖర్చు పెరిగినా, వినియోగదారుడు చెల్లించే ధర పెరిగినా, మధ్యలో రైతుకు ఎంత మిగులుతోంది? వ్యాపార గొలుసులో ఎవరు ఎంత లాభం పొందుతున్నారు? అనే అంశాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది. ధరలు పెరిగిన ప్రతిసారీ రైతే లాభపడుతున్నాడని అనుకోవడం తప్పు. ఉత్పత్తి ఖర్చులు పెరిగి రైతుకు మిగిలే ఆదాయం తగ్గవచ్చు. అదే సమయంలో నిల్వలు, రవాణా, మార్కెట్ పరిస్థితులను ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు అధిక లాభాలు పొందే అవకాశాన్ని కూడా తోసిపుచ్చలేం. అందుకే బియ్యం ధరల సమస్యను రైతు, మిల్లర్, వ్యాపారి, ప్రభుత్వం, వినియోగదారుడు అనే వేర్వేరు కోణాల్లో పరిశీలించాలి. ఉత్పత్తి సమృద్ధిగా ఉన్నా మార్కెట్లో ధరలు ఎందుకు పెరుగుతున్నాయి? గోదాముల్లో నిల్వలు ఎంత ఉన్నాయి? ఏ ప్రాంతాల్లో కొరత ఏర్పడింది? ధరల పెరుగుదలకు నిజమైన కారణం ఏది? అనే వివరాలను ప్రభుత్వం పారదర్శకంగా ప్రజలకు తెలియజేయాలి. పంట పండించే రైతుకు గిట్టుబాటు ధర, అన్నం కొనుగోలు చేసే పేదవాడికి అందుబాటు ధర.. ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించడమే ప్రభుత్వ విధానాలకు అసలైన పరీక్ష.







రాయలసీమలో పెత్తందారీ పోకడలు

- ప్రజాస్వామ్యానికి సవాలుగా రాజకీయం
- నామినేషన్ పత్రాల వేళ రాక్షసత్వం!

రాయలసీమ అంటే ఫ్యాక్షన్ మాత్రమే కాదు.. రతనాల సీమ, రోషానికి ప్రతీక, మాట ఇస్తే నిలబడే మనుషుల నేల. కష్టంలో తోడుండే బంధాలు, అతిథికి అన్నం పెట్టే ఆత్మీయత, పట్టుదలతో ముందుకు సాగే ప్రజలు ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చారు. కాలక్రమంలో పాలేగాళ్ల పాలన అంతరించింది. రాజ్యాంగం అమల్లోకి వచ్చింది. ప్రజలకు ఓటు హక్కు లభించింది. ప్రజలే పాలకులను ఎన్నుకునే ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పడింది. అయితే అధికారాన్ని సాధించాలనే తపన, ప్రత్యర్థిని అణచివేయాలనే ఆధిపత్య ధోరణి కొన్ని రాజకీయ వర్గాల్లో ఇంకా కొనసాగుతున్నాయా? అనే ప్రశ్న మరోసారి తెరపైకి వచ్చింది. అక్టోబరు 16న మునిసిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన తొలిరోజే పుంగనూరు, రాయచోటి, రాజంపేటతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో ఘర్షణలకు సంబంధించిన వార్తలు వెలుగులోకి వచ్చాయి. ఒకవైపు ఎంపీ మిథున్ రెడ్డి కాన్వాయ్‌పై రాళ్ల దాడి జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. మరోవైపు రాయచోటిలో వైసీపీ కార్యాలయం సమీపంలో కార్లు దగ్ధమైనట్లు వార్తలు వెలువడ్డాయి. రాజంపేటలో స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ పత్రాలు చించివేశారని ఆరోపణలు వినిపించాయి. తాడిపత్రి, పత్తికొండ, తిరుపతి, దాచేపల్లి ప్రాంతాల్లోనూ రాజకీయ ఉద్రిక్తతలపై ఫిర్యాదులు, పరస్పర విమర్శలు తెరపైకి వచ్చాయి. ఈ ఘటనలకు సంబంధించి ఎవరి ఆరోపణల్లో వాస్తవం ఉందో దర్యాప్తులో తేలాల్సి ఉంది. అయితే నామినేషన్ వేయడానికి వెళ్లే అభ్యర్థులు భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందనే ఆందోళన మాత్రం ప్రజాస్వామ్య వ్యవస్థకు కీలకమైన ప్రశ్నగా మారింది. ఎన్నికల్లో ప్రత్యర్థిని ఓటుతో ఓడించాలి తప్ప, భయపెట్టి పోటీ నుంచి తప్పించే ప్రయత్నాలు జరగకూడదు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రజలకు సేవ చేసే ప్రతినిధులను ఎన్నుకునేందుకు ఉద్దేశించిన ప్రక్రియ. వాటిని వ్యక్తిగత కక్షలు తీర్చుకునే వేదికగా మార్చడం వల్ల ప్రజలకు నష్టం కలుగుతుంది. రాజకీయ ఆధిపత్యం కోసం జరిగే పోరాటాల్లో ప్రజల హక్కులు బలికాకుండా చూడాల్సిన బాధ్యత అన్ని పార్టీలపై ఉంది.



మీడియా ప్రతినిధులు తమ విధులను నిర్భయంగా నిర్వహించేందుకు అవసరమైన రక్షణ కల్పించాలి. రాజకీయ ఆరోపణలకు సమాధానం ఆధారాలతో రావాలి.. దాడులకు సమాధానం చట్టపరమైన చర్యలతో ఉండాలి. ఎన్నికల సమయంలో ప్రజలకు సమాచారం అందించడం, అభ్యర్థుల హక్కులను కాపాడటం, శాంతిభద్రతలను నిర్వహించడం వంటి బాధ్యతలను పోలీసులు, ఎన్నికల అధికారులు సమర్థంగా నిర్వర్తించాలి. రాజకీయ పార్టీలు కూడా తమ వర్గాల్లో క్రమశిక్షణ పాటించేలా చూడాలి. ఎవరి తప్పును వారు సమర్థించుకునే ప్రయత్నం చేస్తే సమస్య మరింత జటిలమవుతుంది. అన్ని ఘటనలపై నిష్పక్షపాత విచారణ జరిగితేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. ప్రజల్లో ఏర్పడే అనుమానాలకు కూడా స్పష్టమైన సమాధానం లభిస్తుంది.

ఏకగ్రీవాల మోజు.. ప్రజాస్వామ్యానికి పరీక్ష

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాలు సాధించడం తప్పు కాదు. అయితే అవి అభ్యర్థుల స్వచ్ఛంద నిర్ణయంతో జరగాలి తప్ప, బెదిరింపులు, దాడులు, నామినేషన్ పత్రాల విధ్వంసంతో ప్రత్యర్థులను పోటీ నుంచి తప్పించడం ద్వారా కాదు. రాయలసీమలో నామినేషన్ల తొలిరోజు వెలుగుచూసిన ఘటనలు రాజకీయ ఆధిపత్య పోరుపై ఆందోళన పెంచాయి. పుంగనూరులో ఎంపీ మిథున్ రెడ్డి కాన్వాయ్‌పై దాడి జరిగిందన్న ఆరోపణలు, రాయచోటిలో వాహనాల దహనం, రాజంపేటలో స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ పత్రాలు చించివేశారన్న ఫిర్యాదులు ఎన్నికల వాతావరణాన్ని ఉద్రిక్తంగా మార్చాయి. ఈ ఘటనలపై వైసీపీ నేతలు తీవ్రంగా స్పందిస్తూ, బాధ్యులను అరెస్టు చేయాలని, నిర్లక్ష్యం వహించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అభ్యర్థులకు రక్షణ, నామినేషన్ కేంద్రాల్లో సీసీటీవీ నిఘా, అవసరమైన చోట కేంద్ర బలగాల మోహరింపు కోరారు. ఈ ఆరోపణలతో పాటు టీడీపీ వర్గాల ప్రతివిమర్శలను కూడా పరిశీలించి, పోలీసులు, ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వాస్తవాలను నిర్ధారించాలి. కొన్ని ప్రాంతాల్లో జరిగిన ఘటనల ఆధారంగా మొత్తం రాయలసీమను హింసాత్మక ప్రాంతంగా చిత్రీకరించడం సరికాదు. ఈ నేల అభివృద్ధికి, శాంతికి కృషి చేసినవారు ఎందరో ఉన్నారు. రాజకీయ విభేదాలు ప్రజల భద్రతకు ముప్పుగా మారకుండా అన్ని పార్టీలు బాధ్యతగా వ్యవహరించాలి. స్థానిక ఎన్నికల్లో గెలిచినవారు రోడ్లు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలి. ఓడిపోయినవారు ప్రజల తీర్పును గౌరవించాలి. పాలేగాళ్ల పాలన ముగిసినా ఆధిపత్య పోకడలు కొనసాగకూడదు. రాయలసీమకు కావాల్సింది కక్షల రాజకీయం కాదు.. అభివృద్ధి రాజకీయం. ప్రత్యర్థిని అడ్డుకోవడం కాదు.. ప్రజల మనసు గెలుచుకోవడం. సీమ పౌరుషం హింసలో కాదు.. న్యాయంలో కనిపించాలి.

పుంగనూరు.. ఎంపీ కాన్వాయ్ వద్ద ఏం జరిగింది?


అన్నమయ్య జిల్లా పుంగనూరు అక్టోబరు 16న రాజకీయ ఘర్షణలకు సంబంధించిన వార్తలతో రాష్ట్రవ్యాప్తంగా చర్చకు వచ్చింది. రాజంపేట ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లోక్‌సభాపక్ష నాయకుడు పి.వి. మిథున్ రెడ్డి పార్టీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు వెళ్తున్న సమయంలో ఆయన కాన్వాయ్ వద్ద ఉద్రిక్తత నెలకొన్నట్లు వార్తలు వెలువడ్డాయి. వైసీపీ ఆరోపణల ప్రకారం తెలుగుదేశం పార్టీకి చెందిన కొందరు వాహనాలను అడ్డుకుని రాళ్లు, కర్రలు, ఇనుప రాడ్లతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఇరువర్గాలకు చెందిన కొందరు గాయపడినట్లు సమాచారం. పలు వాహనాలు ధ్వంసమైనట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో మిథున్ రెడ్డిని పోలీసులు నామినేషన్ కేంద్రంలోని సురక్షిత గదికి తరలించారు. ఘర్షణను అదుపు చేసేందుకు పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపినట్లు కూడా వార్తలు వచ్చాయి. ఈ ఘటనను వైసీపీ నేతలు తీవ్రంగా ఖండిస్తూ, ఎంపీ ప్రాణాలకు ముప్పు కలిగించేలా దాడి జరిగిందని ఆరోపించారు. మరోవైపు ఘర్షణలకు మిథున్ రెడ్డి అనుచరులే కారణమని టీడీపీ వర్గాలు ప్రతివిమర్శలు చేశాయి. ఈ పరస్పర ఆరోపణల్లో నిజానిజాలను నిర్ధారించాల్సింది పోలీసుల దర్యాప్తు. సీసీటీవీ దృశ్యాలు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, ఇతర ఆధారాల ఆధారంగా ఘటనకు సంబంధించిన వాస్తవాలను వెలికితీయాలి. పుంగనూరులో గతంలోనూ రాజకీయ ఆధిపత్య పోరుకు సంబంధించిన వివాదాలు చర్చకు వచ్చినప్పటికీ, పాత కక్షలను కొనసాగించడం పరిష్కారం కాదు. గతంలో ఎవరు ఎవరితో ఘర్షణ పడ్డారనే అంశాన్ని పక్కనపెట్టి, ప్రస్తుత ఘటనపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. ప్రజాప్రతినిధి కాన్వాయ్ వద్దే భద్రతపై ప్రశ్నలు తలెత్తితే, సాధారణ అభ్యర్థుల పరిస్థితి ఏమిటన్నది ఆలోచించాల్సిన అంశం. అధికారంలో ఉన్నవారికి ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించే బాధ్యత ఉంది. ప్రతిపక్షాలకు చట్టబద్ధంగా పోటీ చేసే హక్కు ఉంది. ఈ రెండు అంశాలకు భంగం కలగకుండా చూడటం పోలీసు యంత్రాంగం, ఎన్నికల అధికారుల కర్తవ్యం. రాళ్లు, కర్రలతో జరిగే ఘర్షణలు ఏ పార్టీకి రాజకీయంగా మేలు చేసినా, ప్రజాస్వామ్యానికి మాత్రం నష్టం కలిగిస్తాయి.

రాయచోటి.. కార్ల దహనంతో కలకలం

పుంగనూరులో ఉద్రిక్తతలపై చర్చ కొనసాగుతున్న సమయంలోనే అన్నమయ్య జిల్లాలోని రాయచోటిలోనూ వాహనాల దహనానికి సంబంధించిన వార్తలు వెలుగులోకి వచ్చాయి. మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత గడికోట శ్రీకాంత్ రెడ్డి కార్యాలయం ఉన్న ఎస్ఎన్ కాలనీ పరిసరాల్లో వాహనాలపై దాడి జరిగి కొన్ని కార్లు దగ్ధమయ్యాయి. కార్యాలయం కూడా కొంతమేర అగ్నికి ఆహుతైంది. అయితే దగ్ధమైన వాహనాల సంఖ్య, జరిగిన నష్టం విషయంలో వేర్వేరు కథనాల్లో భిన్నమైన వివరాలు వెలువడ్డాయి. అధికారిక నిర్ధారణ వచ్చే వరకు కచ్చితమైన సంఖ్యను తేల్చి చెప్పడం సమంజసం కాదు. ఈ ఘటనకు తెలుగుదేశం పార్టీ శ్రేణులే కారణమని వైసీపీ ఆరోపించింది. స్థానిక రాజకీయ వర్గాల మధ్య పరస్పర విమర్శలు కూడా కొనసాగాయి. రాయచోటి రాజకీయాల్లో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి మధ్య రాజకీయ పోటీ గతంలోనూ చర్చకు వచ్చింది. నాయకుల మధ్య విమర్శలు, ప్రతివిమర్శలు రాజకీయాల్లో సాధారణమే. కానీ ఆ వివాదాలు వాహనాల దహనం, ఆస్తుల విధ్వంసం వరకు చేరితే దాని ప్రభావం రాజకీయ నాయకులకే పరిమితం కాదు. స్థానిక ప్రజలు, వ్యాపారులు, కార్యకర్తలు, నివాసితులు కూడా భయాందోళనలకు గురవుతారు. ఒక కారు దగ్ధమైతే దాని యజమానికి ఆర్థిక నష్టం కలుగుతుంది. కుటుంబ అవసరాలకు ఉపయోగించే వాహనం ధ్వంసమైతే వారి దైనందిన జీవితం కూడా ప్రభావితమవుతుంది. పార్టీ కార్యాలయం పరిసరాల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటే అక్కడికి వెళ్లే వ్యక్తులు సైతం భద్రతపై ఆందోళన చెందుతారు. అందువల్ల రాయచోటిలో జరిగిన ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ చేపట్టాలి. దాడికి పాల్పడినవారు ఏ పార్టీకి చెందినవారైనా ఆధారాల ప్రకారం చర్యలు తీసుకోవాలి. రాజకీయ పలుకుబడి ఉన్నవారికి ఒక



న్యాయం, సాధారణ కార్యకర్తలకు మరో న్యాయం అనే భావనకు అవకాశం ఇవ్వకూడదు. నాయకులు కూడా తమ అనుచరులకు స్పష్టమైన సందేశం ఇవ్వాలి. రాజకీయంగా ప్రత్యర్థిని విమర్శించే హక్కు ఉంది.. అతడి ఆస్తులను ధ్వంసం చేసే హక్కు ఎవరికీ లేదు. ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి ఒక్కరికీ భద్రత కల్పించడం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత. స్థానిక వివాదాలు హింసకు దారితీయకుం దా ముందస్తు



చర్యలు తీసుకోవడం కూడా అంతే ముఖ్యం.

రాజంపేట.. నామినేషన్ పత్రాలకే రక్షణ లేదా?

రాజంపేటలో వెలుగులోకి వచ్చిన మరో ఆరోపణ ఎన్నికల ప్రక్రియలో అభ్యర్థుల భద్రతపై ఆందోళనను పెంచింది. మునిసిపల్ చైర్మన్ పదవికి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చిన బొప్పూరి రేణుక తన నామినేషన్ పత్రాలు, విద్యార్హత ధ్రువపత్రాలు, హ్యాండ్‌బ్యాగ్‌ను టీడీపీ నాయకుడు దొంతం శివతో పాటు ఆయన అనుచరులు లాక్కొని చించివేశారని మీడియా ఎదుట ఆరోపించారు. ఈ ఘటనపై పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నట్లు వివరాలు వెలువడ్డాయి. ఒక అభ్యర్థి నామినేషన్ పత్రాలను ధ్వంసం చేశారనే ఆరోపణ నిజమని తేలితే, అది వ్యక్తిగత పత్రాలకు జరిగిన నష్టం మాత్రమే కాదు. ఎన్నికల్లో పోటీ చేసే హక్కును అడ్డుకునే తీవ్రమైన చర్యగా పరిగణించాల్సి ఉంటుంది. ముఖ్యంగా స్వతంత్ర అభ్యర్థులకు పెద్ద పార్టీ అండదండలు లేకపోవచ్చు. ప్రచారం కోసం భారీగా కార్యకర్తలు ఉండకపోవచ్చు. అయినప్పటికీ వారి రాజకీయ హక్కులు ఇతర అభ్యర్థుల హక్కులతో సమానమే. ఒక మహిళ తన విద్యార్హత ధ్రువపత్రాలతో నామినేషన్ వేయడానికి వచ్చినప్పుడు ఆమెకు భద్రత కల్పించడం ఎన్నికల యంత్రాంగం బాధ్యత. పార్టీ బలం, ఆర్థిక స్థాయి, రాజకీయ పలుకుబడి ఆధారంగా పోటీ చేసే అవకాశాలు మారకూడదు. ఈ నేపథ్యంలో రాజంపేట ఘటనపై నిష్పక్షపాత విచారణ జరగాలి. పత్రాలు నిజంగా చించివేసినట్లు తేలితే, సంబంధిత అధికారుల సహకారంతో అవసరమైన ధ్రువపత్రాలను తిరిగి పొందేందుకు అభ్యర్థికి సహాయం చేయాలి. నామినేషన్ దాఖలుకు సంబంధించిన గడువు, ఎన్నికల నిబంధనలను దృష్టిలో ఉంచుకుని చట్టబద్ధమైన పరిష్కారం కల్పించే అవకాశాలను పరిశీలించాలి. బలహీనంగా ఉన్న అభ్యర్థి హక్కులు బలమైన రాజకీయ వర్గాల కారణంగా తగ్గిపోకూడదు. ప్రత్యర్థిని పోటీ నుంచి తప్పించేందుకు బెదిరింపులు, పత్రాల విధ్వంసం వంటి చర్యలకు పాల్పడినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకం కలగాలంటే ప్రతి అభ్యర్థికి సమాన అవకాశాలు ఉండాలి. నామినేషన్ దాఖలు చేయడం కూడా భయంతో కూడిన పనిగా మారితే స్థానిక ప్రజాస్వామ్య లక్ష్యమే దెబ్బతింటుంది.

తాడిపత్రి నుంచి తిరుపతి వరకు ఆరోపణలు

పుంగనూరు, రాయచోటి, రాజంపేట ఘటనలతోనే అక్టోబరు 16న రాజకీయ ఉద్రిక్తతలు ముగియలేదు. వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి, పార్టీ లీగల్ సెల్ అధ్యక్షుడు మనోహర్ రెడ్డి మీడియా సమావేశంలో తాడిపత్రి, పత్తికొండ, తిరుపతి, దాచేపల్లి తదితర ప్రాంతాల్లో చోటుచేసుకున్న పరిణామాలను ప్రస్తావించారు. తాడిపత్రిలో చైర్మన్ అభ్యర్థి ఫయాజ్ బాషాపై కేసులు, కౌన్సిలర్ అభ్యర్థులపై దాడులు, మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిపై కేసు నమోదైన అంశాలను వారు ప్రస్తావించారు. పత్తికొండలో మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి కుమారుడి అరెస్టు, దాచేపల్లిలో చైర్మన్ అభ్యర్థి కొప్పుల రవికుమార్ నిర్బంధం, తిరుపతిలో ఘటనలను చిత్రీకరిస్తున్న కెమెరామెన్‌పై దాడి జరిగిందన్న ఆరోపణలను కూడా ముందుకు తెచ్చారు. అదే సమయంలో ఎన్నికల సమయంలో ప్రతిపక్ష అభ్యర్థులపై చర్యలు తీసుకున్నప్పుడు వాటి వెనుక కారణాలు పారదర్శకంగా ఉండాలి. చట్టం తన పని తాను చేసిందా? లేక రాజకీయ ప్రయోజనాల కోసం చట్టాన్ని ఉపయోగించారా? అనే ప్రశ్నలకు ఆధారాలే సమాధానం చెప్పాలి. ఈ ప్రమాణం అన్ని రాజకీయ పార్టీలకు సమానంగా వర్తించాలి. అధికార పక్షం తన రాజకీయ బలాన్ని ఉపయోగించి పోలీసు వ్యవస్థపై ప్రభావం చూపకూడదు. ప్రతిపక్షం కూడా ప్రతి చట్టపరమైన చర్యను రాజకీయ కుట్రగా పేర్కొనే ముందు వాస్తవాలను పరిశీలించాలి. మరోవైపు ఎన్నికల సంఘం నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవడంలో ఎలాంటి పక్షపాతం చూపకూడదు. తిరుపతిలో కెమెరామెన్‌పై దాడి జరిగిందన్న ఆరోపణ కూడా తీవ్రంగా పరిశీలించాల్సిన అంశం. జర్నలిస్టులు సంఘటనలను చిత్రీకరిస్తున్న సమయంలో వారిపై దాడులు జరిగితే ప్రజలకు వాస్తవాలు చేరే మార్గం దెబ్బతింటుంది.

న్యూజిలాండ్‌తో సమరానికి భారత్ సిద్ధం!



న్యూజిలాండ్‌తో క్రికెట్ పోరుకు టీమిండియా అస్త్రశస్త్రాలు సిద్ధం చేసింది! ఐదు వన్డేలు, రెండు టెస్టుల సిరీస్‌లకు బీసీసీఐ శుక్రవారం జట్లను ప్రకటించడంతో ఆసక్తికర సమరానికి తెరలేచింది. తొలి మూడు వన్డేల్లో శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా జట్టును నడిపించనుండగా, చివరి రెండు మ్యాచ్‌ల్లో శ్రేయస్ అయ్యర్ సారథ్య బాధ్యతలు చేపట్టనున్నాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ పూర్తి వన్డే సిరీస్‌కు అందుబాటులో ఉండటం అభిమానులకు పెద్ద ఊరట. టెస్టు జట్టులోనూ గిల్ నాయకత్వం కొనసాగనుంది. పేసర్ ఆకాష్ దీప్ టెస్టు జట్టులోకి తిరిగి రాగా, వికెట్ కీపర్ కుమార్ కుశాగ్రకు చివరి రెండు వన్డేల కోసం తొలిసారి పిలుపు అందింది. స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాకు వన్డేల్లో విశ్రాంతి కల్పించి, టెస్టులకు ఎంపిక చేశారు. హార్దిక్ పాండ్యాకు వన్డే జట్టులో చోటు దక్కలేదు. టెస్టుల్లో రిషభ్ పంత్, ధ్రువ్ జురెల్ వికెట్ కీపర్లుగా ఎంపికయ్యారు. అయితే పంత్ బరిలోకి దిగడం బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అనుమతిపై ఆధారపడి ఉంటుంది. నవంబర్ 4న వన్డే సమరం మొదలై, నవంబర్ 19 నుంచి టెస్టుల పోరు సాగనుంది. గిల్ సారథ్యం, అయ్యర్ నాయకత్వం, కోహ్లీ -రోహిత్ అనుభవం.. కివీస్‌పై భారత్ విజయమే లక్ష్యంగా బరిలోకి దిగనుంది!



నికీ మెరుపులు..దీప్తి ధమాకా!

జింబాబ్వేతో తొలి టీ20లో టీమిండియా గెలిచింది.. కానీ విజయం కోసం చెమటోడ్చాల్సి వచ్చింది! రాయ్‌పూర్‌లో శుక్రవారం జరిగిన ఉత్కంఠ పోరులో భారత మహిళల జట్టు నాలుగు వికెట్ల తేడాతో జింబాబ్వేను ఓడించి మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1–0 ఆధిక్యం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే నిర్ణీత ఓవర్లలో 114/5 పరుగులు చేసింది. ఓపెనర్ కెలిస్ న్డ్లోవు 44 బంతుల్లో 42 పరుగులతో రాణించగా, షార్నే మేయర్స్ 33 బంతుల్లో అజేయంగా 43 పరుగులు చేసి జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించింది. లక్ష్య ఛేదనలో భారత్‌కు న్యాషా గ్వాంజురా షాక్ ఇచ్చింది. మూడు వికెట్లు పడగొట్టి భారత టాపార్డర్‌ను కుప్పకూల్చడంతో స్కోరు 19/4కు చేరింది. ఓటమి అంచున నిలిచిన జట్టును దీప్తి శర్మ, అరంగేట్ర క్రీడాకారిణి నికీ ప్రసాద్ ఆదుకున్నారు. దీప్తి 49 పరుగులతో దూకుడుగా ఆడగా, నికీ 39 పరుగులతో అజేయంగా నిలిచి ఒత్తిడిని చిత్తు చేసింది. వీరిద్దరూ ఐదో వికెట్‌కు కీలక భాగస్వామ్యాన్ని నిర్మించి విజయానికి బాటలు వేశారు. మరో 26 బంతులు మిగిలుండగానే భారత్ లక్ష్యాన్ని చేరుకుంది. ఆరంభంలో తడబడినా, చివర్లో సత్తా చాటిన భారత అమ్మాయిలు అభిమానులకు ఉత్కంఠతో కూడిన విజయాన్ని అందించారు.

తడబడి గెలిచి...


స్మృతి సేనకు ఊరట!

జింబాబ్వేతో తొలి టీ20లో భారత మహిళల జట్టు విజయాన్ని అందుకున్నా.. ఆరంభంలో మాత్రం వణికిపోయింది! రాయ్‌పూర్‌లో శుక్రవారం జరిగిన పోరులో 115 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ పవర్‌ప్లేలోనే 19 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో దీప్తి శర్మ (49), అరంగేట్ర ఆటగాళ్లలో ఒకరైన నికీ ప్రసాద్ (39 నాటౌట్) అద్భుతంగా పోరాడి 82 పరుగుల కీలక భాగస్వామ్యంతో జట్టును గట్టెక్కించారు. మరో 26 బంతులు మిగిలుండగానే ఆరు వికెట్ల తేడాతో భారత్ గెలిచి మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1–0 ఆధిక్యం సాధించింది. పూర్తిస్థాయి కెప్టెన్‌గా తొలి విజయాన్ని అందుకున్న స్మృతి మంధాన సంతోషం వ్యక్తం చేసినా, జట్టు ఆశించిన స్థాయిలో ఆడలేదని అంగీకరించింది. దీప్తి దూకుడు, నికీ ప్రశాంతత, నందిని శర్మ బౌలింగ్‌ను ప్రశంసించింది. ఫీల్డింగ్‌లో చూపిన పోరాట పటిమ సానుకూలాంశమని పేర్కొంది. జింబాబ్వే కెప్టెన్ జోసెఫిన్ న్కోమో తమ బౌలర్ల ప్రదర్శనపై గర్వం వ్యక్తం చేసింది. అయితే 67 డాట్ బాల్స్ ఆడటం తమ జట్టు కొంపముంచిందని, సింగిల్స్, డబుల్స్‌పై దృష్టి పెట్టాలని చెప్పింది. రెండో టీ20 ఆదివారం జరగనుంది.

సీఎస్కేలో ధోనీ కొత్త అవతారం!



చెన్నై సూపర్ కింగ్స్‌లో మహేంద్ర సింగ్ ధోనీ ఇక మెంటార్‌గా మారనున్నాడా? ఐపీఎల్ తదుపరి సీజన్‌కు ముందే ఈ ఆసక్తికర చర్చకు తెరలేపాడు మాజీ భారత ఆల్‌రౌండర్ రవిచంద్రన్ అశ్విన్. తన యూట్యూబ్ ఛానల్‌లో మాట్లాడిన అతడు, కొత్త కోచ్ జహీర్ ఖాన్ రాకతో సీఎస్కేలో నాయకత్వ సమీకరణాలు ఎలా మారతాయో చూడాలని ఆసక్తి వ్యక్తం చేశాడు. ధోనీ మెంటార్ పాత్ర పోషించే అవకాశం ఉందని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ జహీర్‌తో ఎలా పనిచేస్తాడు? కీలక సలహాల కోసం ధోనీని ఆశ్రయిస్తాడా? అన్నది ఆసక్తికరంగా మారుతుందని పేర్కొన్నాడు. 2026 సీజన్‌లో సీఎస్కే 12 పాయింట్లతో ఎనిమిదో స్థానానికి పరిమితమై, వరుసగా మూడోసారి ప్లేఆఫ్స్‌కు దూరమైంది. గాయం కారణంగా ధోనీ ఒక్క మ్యాచ్ కూడా ఆడలేకపోయాడు. మరోవైపు, దీర్ఘకాల కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ నిష్క్రమణపైనా అశ్విన్ స్పందించాడు. ధోనీ నాయకత్వానికి అనుగుణంగా ఫ్లెమింగ్ తన విధానాన్ని మలుచుకున్నాడని, గైక్వాడ్‌తో అదే విజయాన్ని సాధించలేకపోయాడని విశ్లేషించాడు. సీఎస్కే యాజమాన్యం భారతీయ కోచ్ కావాలనే నిర్ణయంతో జహీర్‌కు బాధ్యతలు అప్పగించింది. గతంలో లక్నో సూపర్ జెయింట్స్‌కు మెంటార్‌గా, ముంబై ఇండియన్స్‌తోనూ పనిచేసిన జహీర్ ఇప్పుడు చెన్నై జట్టును ఎలా తీర్చిదిద్దుతాడో చూడాలి. ధోనీ అనుభవం, జహీర్ వ్యూహాలు, గైక్వాడ్ నాయకత్వం.. సీఎస్కే తదుపరి ప్రయాణంలో కీలకంగా మారనున్నాయి.



కరువు కాటకాలు.. బ్రిటిష్ క్రూరత్వం.. తిరుగుబాటు జ్వాలలు! విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా దర్శకుడు రాహుల్ సాంకృత్యన్ తెరకెక్కించిన రణబాలి వెండితెరపై రాయలసీమ గతాన్ని మరోసారి కళ్లముందుకు తీసుకొచ్చింది. 1876–78 నాటి మహా మద్రాస్ కరువు నేపథ్యంగా సాగే ఈ చారిత్రక యాక్షన్ డ్రామాలో ఆకలి కేకలు, ఆంగ్లేయుల దోపిడీ, మట్టికోసం పోరాడిన వీరుల గాథలు కథకు ప్రధాన బలంగా నిలుస్తాయి. పట్టణ యువకుడి ఇమేజ్‌ను పక్కనపెట్టి, కందలు తిరిగిన యోధుడిగా విజయ్ దేవరకొండ చేసిన మేకోవర్ ప్రత్యేక ఆకర్షణ. రణబాలి పాత్రలో ఆయన ఆవేశం, పోరాట సన్నివేశాలు అభిమానులకు మాస్ కిక్ ఇస్తాయి. జయమ్మగా రష్మిక మందన్న అమాయకత్వం, ఆత్మవిశ్వాసం, భావోద్వేగాలతో కథకు అందమైన ఊపిరి పోశారు. వీరిద్దరి మధ్య ప్రేమకథ కఠినమైన కథనంలో హృద్యమైన విరామాన్ని అందిస్తుంది. బుర్రకథ సంప్రదాయం, జానపద గాథలు, బ్రిటిష్ పాలన నాటి పరిస్థితులను మేళవించిన తీరు ఆసక్తిని రేకెత్తిస్తుంది. గండికోట అందాలు, అనాటి గ్రామీణ వాతావరణం, వస్త్రధారణ, నేపథ్య సంగీతం ప్రేక్షకులను మరో కాలంలోకి తీసుకెళ్తాయి. ధాన్యాన్ని దోచుకున్న రైల్వే మార్గాల నేపథ్యం కథకు చారిత్రక కోణాన్ని జోడిస్తుంది. అయితే చరిత్ర, భక్తి, పురాణ ఛాయలు, హింసాత్మక సన్నివేశాలు ఒకేసారి ఎక్కువ కావడంతో చివరి గంటలో కథనం నెమ్మదిస్తుంది. కొన్ని సన్నివేశాల్లో అతిగా చూపించిన హింస భావోద్వేగాలను తగ్గిస్తుంది. అయినప్పటికీ, మరుగునపడిన రాయలసీమ చరిత్రను వెండితెరపై ఆవిష్కరించాలన్న ప్రయత్నం ప్రశంసనీయం. మాస్ యాక్షన్, ప్రేమ, చరిత్ర కలగలిపిన ఈ 178 నిమిషాల ప్రయాణం అభిమానులకు కొత్త అనుభూతిని అందిస్తే, కథనంలో మరింత బిగువు ఉంటే ప్రభావం ఇంకాస్త పెరిగేది!

రాయలసీమ రణగర్జన..

రణబాలి

చరిత్రకు వీరత్వం.. ప్రేమకు భావోద్వేగం!

క్రేజీ కళ్యాణం

• పెళ్లి కోసం తండ్రి పంతం
• స్వేచ్ఛ కోసం కూతురి పోరాటం!



పెళ్లంటే పండగే కాదు.. ఓ కుటుంబంలో దాగున్న బంధాలు, బలహీనతలు, భావోద్వేగాల అసలైన పరీక్ష! ఈ పాయింట్‌ను పట్టుకుని తెరకెక్కిన తెలుగు చిత్రం క్రేజీ కళ్యాణం ప్రేక్షకులను కుటుంబ కలహాల మధ్యకు తీసుకెళ్తుంది. దర్శకుడు బద్రప్ప గజుల తెరకెక్కించిన ఈ చిత్రంలో సీనియర్ నటుడు నరేశ్, అనుపమ పరమేశ్వరన్ తమ నటనతో కథకు ప్రధాన బలంగా నిలిచారు. మెదక్ నేపథ్యంలో సాగే కథలో పార్వతాలు (నరేశ్) తన పెద్ద కుమార్తె పెళ్లి విషయంలో ఎదురైన అనుభవాలతో చిన్న కుమార్తె కీర్తి (అనుపమ)కు సంపన్న కుటుంబంలో పెళ్లి చేయాలని పట్టుబడతాడు. కానీ కీర్తి కలలు వేరు! ప్రభుత్వ ఉద్యోగం సాధించి ఆర్థికంగా తన కాళ్లపై తాను నిలబడాలనుకుంటుంది. ప్రేమించిన ఉదయ్ (అఖిల్ ఉద్దేమారి)తో తన భవిష్యత్తును తానే నిర్ణయించుకోవాలని భావిస్తుంది. కూతురి ప్రవేశ పరీక్షకు రూ.30 వేలు ఖర్చు పెట్టేందుకు వెనుకాడే తండ్రి, పెళ్లి కోసం రూ.30 లక్షలు వెచ్చించేందుకు సిద్ధపడటం కథలోని సామాజిక వైరుధ్యాన్ని బలంగా చూపిస్తుంది. కూతురు కనిపించకుండా పోవడం, బంధువుల మధ్య రగిలే విభేదాలు, తండ్రి అంతర్మథనం క్లైమాక్స్‌కు భావోద్వేగ బలాన్నిస్తాయి. నరేశ్ నటన ప్రత్యేక ఆకర్షణ కాగా, అనుపమ తన పాత్రలోని పట్టుదలను చక్కగా పలికించారు. తరుణ్ భాస్కర్ సహజ నటన, అఖిల్ ఉద్దేమారి తెరపై కనిపించే తీరు ఆకట్టుకుంటాయి. సురేశ్ బొబ్బిలి పాటలు, శ్యామ్ దుపాటి ఛాయాగ్రహణం చిన్న పట్టణ జీవనాన్ని సహజంగా ఆవిష్కరిస్తాయి.



హైదరాబాద్‌లో 'రామాయణం' రణభేరి

అక్టోబర్ 19న గ్రాండ్ ఈవెంట్!

ఒకే వేదికపై రణబీర్, యశ్..

అభిమానులకు పండగే పండుగ! భారతీయ ఇతిహాసాన్ని ప్రపంచ సినిమా స్థాయిలో ఆవిష్కరించాలన్న లక్ష్యంతో తెరకెక్కుతున్న 'రామాయణం' ప్రచార హోరు రోజురోజుకూ పెరుగుతోంది. ఇప్పటికే బెంగళూరులో నిర్వహించిన గ్రాండ్ ఈవెంట్‌తో ప్రేక్షకుల్లో ఆసక్తిని రగిలించిన చిత్రబృందం.. ఇప్పుడు హైదరాబాద్‌లో మరో భారీ వేడుకకు సిద్ధమైంది. అక్టోబర్ 19న జేఆర్‌సీ కన్వెన్షన్‌లో జరగనున్న ప్రీరిలీజ్ ఈవెంట్ సినీ అభిమానులకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఈ వేడుకకు రాముడిగా రణబీర్ కపూర్, రావణుడిగా యశ్‌తో పాటు సాయి పల్లవి, కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్ సింగ్, రవి దుబే హాజరుకానున్నారు. దర్శకుడు నితేశ్ తివారీ, నిర్మాత నమిత్ మల్హోత్రాతో పాటు చిత్రబృందంలోని కీలక సభ్యులు సందడి చేయనున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, సంగీతం ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచుతున్నాయి. బెంగళూరు వేడుకలో విడుదల చేసిన కొత్త ట్రైలర్ విజువల్స్ నెటిజన్లను విశేషంగా ఆకట్టుకున్నాయి. హాలీవుడ్ స్థాయి గ్రాఫిక్స్, కళ్లు చెదిరే విజువల్ ఎఫెక్ట్స్, అద్భుతమైన ఛాయాగ్రహణం, ప్రభావవంతమైన సంగీతం ట్రైలర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. భారీ నిర్మాణ విలువలు, విస్తృతమైన సెట్స్, ఇతిహాసానికి తగిన దృశ్య వైభవం సినిమాపై అంచనాలను మరింత పెంచుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులకు భారతీయ ఇతిహాసాన్ని కొత్త అనుభూతితో అందించాలనే ప్రయత్నంలో చిత్రబృందం ప్రచార కార్యక్రమాలను ముమ్మరం చేసింది. హైదరాబాద్ వేడుకతో ఈ హైప్ మరింత పెరగనుంది. దీపావళి కానుకగా నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్న 'రామాయణం: పార్ట్ వన్'.. వెండితెరపై ఎలాంటి అద్భుతాన్ని సృష్టిస్తుందోనని సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు!

నెట్‌ఫ్లిక్స్‌లో భారీ మార్పులు

పీటర్ రైస్‌కు పగ్గాలు! • కంటెంట్ వ్యూహంలో కొత్త మలుపు!



ఓటీటీ ప్రపంచాన్ని ఏలుతున్న నెట్‌ఫ్లిక్స్‌లో ఇప్పుడు కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రేక్షకుల ఆదరణలో మందగమనం, ఆదాయ వృద్ధిపై ఒత్తిడి, షేరు విలువ పతనం నేపథ్యంలో సంస్థ తన కంటెంట్ వ్యూహాన్ని సమూలంగా మార్చేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా చీఫ్ క్రియేటివ్ ఆఫీసర్‌గా పీటర్ రైస్‌ను నియమించింది. డిస్నీలో జనరల్ ఎంటర్‌టైన్‌మెంట్ విభాగానికి నాయకత్వం వహించిన రైస్‌కు విస్తృతమైన టీవీ కంటెంట్ నిర్వహణలో అనుభవం ఉన్నాయి. ఈ ఏడాది నెట్‌ఫ్లిక్స్ షేరు విలువ సుమారు 23 శాతం కోల్పోయింది. మారుతున్న ప్రేక్షకుల అభిరుచులకు తగ్గట్టుగా కంటెంట్‌లో కొత్త జోష్ నింపడం, హాలీవుడ్ స్థాయి సృజనాత్మకతను మరింత విస్తరించడం ఇప్పుడు పీటర్ రైస్ ముందున్న అసలు పరీక్ష!

This newspaper is Owned and Published by **GUNDEBOINA VENKANNA** from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: **GUNDEBOINA VENKANNA** and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: **TGBIL/26/A6717**. www.rajyasamskarana.com.